
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



ఎప్పటికి పూర్తయ్యేనో..?



క్రిష్ణా సర్కిల్ నుంచి మాచుపల్లె రోడ్డులో డ్రైనేజీ పనులు



రోడ్డు పనుల్లో భాగంగా డ్రైనేజీ తవ్వేయడంతో నిలిచిన మురుగునీరు

- రూ.120 కోట్లతో కడపలో రోడ్లు, డ్రైనేజీల పనులు
- నాలుగున్నరేళ్లు వదిలేసి.. ఎన్నికల ముందు హడావిడి
- వాటి పూర్తి కోసం కమిషనర్ పడరాని పాట్లు
- సీఎంతో ఓపెనింగ్ కోసం యుద్ధప్రాతిపదికన పనులు
- పైపై మెరుగులతో రిబ్బన్ కటింగ్‌లు
- ఇప్పటికీ పూర్తి కాక జనం అవస్థలు
- ఆ రోడ్డున వెళ్లేవారికి నరకం

నెల క్రితం కడప నగరమంతా ఎక్కడ చూసినా అభివృద్ధి పనులే.. రోడ్ల విస్తరణ, సర్కిళ్ల ఆధునికీకరణ, డ్రైనేజీల పనులు, డివైడర్ల ఏర్పాటు.. రేయింబవళ్లు పనులే పనులు.. దీనికోసం రోడ్లు బ్లాక్ చేశారు. రాజంపేట మార్గంలో వెళ్లే బస్సులనూ నగరంలోంచి కాకుండా కలెక్టరేట్ మీదుగా మళ్లించారు. అయినా జనం భరించారు. ఇంకెన్ని రోజుల్లే.. సీఎం జగన్ వస్తారు.. ప్రారంభిస్తారు.. రోడ్లన్నీ తళతళలా మెరుస్తాయి అనుకున్నారు. సీఎం వచ్చారు.. 23వ తేదీన అసంపూర్తి పనులను ప్రారంభించారు.. వెళ్లిపోయారు.. కానీ.. పనులు మాత్రం సా..గుతూనే ఉన్నాయి.. పనుల్లో వేగం తగ్గడంతో నగర వాసులే నిత్యం నరకం అనుభవిస్తున్నారు. రోడ్ల విస్తరణ, డ్రైనేజీల పనులు జరిగేదంతా బాగా వ్యాపారాలు జరిగే రోడ్లే కావడంతో.. రోజూ కోట్ల రూపాయల్లో నష్టపోతున్నామని వ్యాపారులు వాపోతున్నారు. ఈ పనులు ఎప్పటికి పూర్తవుతాయో అని జనం ఆందోళన చెందుతున్నారు.

(కడప-ఆంధ్రజ్యోతి): కడపలో రహదారుల విస్తరణ, వర్షంనీరు, మురుగునీరు వెళ్లేందుకు డ్రైనేజీల పనులకు 2021 జూలైలో సీఎం వైఎస్ జగన్ శంకుస్థాపన చేశారు. తొలుత కడప నగరంలో 16 రోడ్లు విస్తరణ చేపట్టాలని నిర్ణయించారు. మొదటి విడతలో మహావీర్ సర్కిల్, కలెక్టరేట్ రోడ్డు, రైల్వేస్టేషన్ రోడ్డు పూర్తి చేశారు. రెండో విడతలో అంబేడ్కర్ సర్కిల్, వైజంక్షన్, గోకుల్ లాడ్జి, క్రిష్ణా సర్కిల్, అన్నమయ్య సర్కిల్, క్రిష్ణా సర్కిల్ - మాసాపేట సర్కిల్, దేవునికడప రోడ్డు, సాయిపేట రోడ్డు విస్తరణ పనులు రూ.120 కోట్లతో చేపట్టారు. రెండేళ్లముందే వీటికి సీఎం శంకుస్థాపన చేసినా నిధుల విడదలలో జాప్యం జరగడంతో పనులు ఆలస్యమయ్యాయని అంటున్నారు.



వైజంక్షన్ నుంచి అప్సర సర్కిల్ మార్గంలో జరుగుతున్న పనులు

సీఎం వస్తున్నారని..

సీఎం జగన్ రాక కోసం డిసెంబరులో యుద్ధప్రాతిపదికన పనులు చేశారు. రోడ్లను బ్లాక్ చేశారు. చివరికి చేసిందేందంటే కోటిరెడ్డిసర్కిల్, అంబేడ్కర్ సర్కిల్, సెవెన్‌రోడ్స్ సర్కిల్ మాత్రమే సీఎం ప్రారంభించారు. అంబేడ్కర్ సర్కిల్ నుంచి వై.జంక్షన్ వెళ్లే రహదారి విస్తరణ చేసినప్పటికీ ఇప్పటికీ అది పూర్తి కాలేదు. డివైడర్ పనులు, ఓ సైడు రోడ్డు పనులు జరుగుతూనే ఉన్నాయి. దీంతో వాహనాలన్నీ ఒకవైపునే వెళుతున్నాయి. ఈ ఏరియాలో కమర్షియల్ కాంప్లెక్స్‌లు ఉండడంతో వాహనాలను రోడ్డుపై పెడుతున్నారు. దీంతో ఇదే రోడ్డుపై ఒకేసారి రెండు బస్సులు వచ్చాయంటే చాలు.. ట్రాఫిక్ జాం అయ్యి జనాలు అవస్థలు పడుతున్నారు.

ఇళ్లల్లోకి వెళ్లాలన్నా ఇబ్బందులే..

వైజంక్షన్ నుంచి అప్సర వెళ్లే రహదారిలో డ్రైనేజీ పనులు ఇంకా జరుగుతూనే ఉన్నాయి. మృత్యుంజయేశ్వరాలయం నుంచి ఆ లైను అంతా డ్రైనేజీ పనులు నత్తనడకన సాగుతుండడంతో అక్కడున్న వ్యాపారస్తులు బిజినెస్ లేక తీవ్రంగా నష్టపోతున్నారు. ఇక్కడ కూడా ఒకవైపే వాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతో అవస్థలు పడుతున్నారు. డ్రైనేజీ పనులు పూర్తికాక ఇళ్లల్లోకి వెళ్లాలంటే కూడా జనానికి ఇబ్బందులు తప్పడం లేదు.



మార్కెట్‌యార్డు ఎదురుగా నిలచిన మురుగునీరు

మురుగునీటి మయం

ఇక గోకుల్‌లాడ్జి నుంచి క్రిష్ణాసర్కిల్ మీదుగా అన్నమాచార్య విగ్రహం వరకు రహదారి విస్తరణ చేపట్టారు. గోకుల్‌లాడ్జి పడగొట్టారు కానీ, అక్కడ నుంచి క్రిష్ణా సర్కిల్ వరకు.. క్రిష్ణా సర్కిల్ నుంచి అన్నమయ్య సర్కిల్ వరకు పనులు నత్తనడకన సాగుతున్నాయి డ్రైనేజీ కోసం రోడ్లు తవ్వేశారు. కట్టడాలు కూల్చివేశారు. దీంతో ఈ ప్రాంతమంతా మురుగునీటి మయంగా మారింది. ఇక అన్నమయ్య సర్కిల్ నుంచి కరెంటు ఆఫీసు వరకు వన్‌సైడే రోడ్డు ఉంది. దీంతో జనాలు అవస్థలు పడుతున్నారు.

దేవుని కడప వెళ్లాలంటే..

క్రిష్ణ సర్కిల్ నుంచి మాసాపేట, దేవునికడప రోడ్డు వరకు పనులు జరుగుతున్నాయి. సీఎం జగన్ వస్తున్న నేపథ్యంలో డిసెంబరు నెలలో పనులు వేగంగా చేశారు. జగన్ వచ్చి వెళ్లిపోవడంతో ఇప్పుడు పనులు నత్తనడకన సాగుతున్నాయి. డ్రైనేజీ కోసం ఎక్సకవేటర్లు పెట్టి భారీగా తవ్వేశారు. దీంతో అక్కడున్న వ్యాపారులు, జనం రోడ్డుపైకి రావాలంటే అవస్థలు పడుతున్నారు. చెక్కలు వేసుకుని బయటికి వస్తున్నారు. ఈ రోడ్డు దెబ్బతిని మురుగు నీరంతా రోడ్డుపైకి వస్తోంది. కడపవాసులు దేవనికడపకు వెళుతుంటారు. ముఖ్యంగా శనివారం అయితే దేవుని దర్శనానికి వేలల్లో వెళుతుంటారు. రోడ్డు పనుల కారణంగా వాహనాలు పోవడానికి దారిలేక భక్తులు అవస్థలు పడుతున్నారు. అట్టహాసంగా ప్రారంభించిన పనులు రోజులు గడిచే కొద్దీ నెమ్మదిగా సాగడం నగర వాసులను ఆందోళనకు గురిచేస్తోంది. ఈ పనులు చూసి జనం ఇవి ఎప్పటికి పూర్తవుతాయో మాకష్టాలు ఎప్పుడు తీరుతాయో అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

డీసీసీ బ్యాంకు టర్నోవర్ రూ.3 వేల కోట్లు



మాట్లాడుతున్న డీసీసీబీ చైర్‌పర్సన్ ఝాన్సీరాణి

- అన్ని వర్గాలకు విరివిగా రుణాలు
- ప్రజాప్రతినిధులు డిపాజిట్ చేయాలి
- డీసీసీబీ చైర్‌పర్సన్ ఝాన్సీరాణి

కడప(రూరల్), జనవరి 9: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) టర్నోవర్ 2023 డిసెంబరు నాటికి రూ.3 వేల కోట్లకు చేరిందని ఆ బ్యాంకు చైర్‌పర్సన్ ఎం.ఝాన్సీరాణి పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం డీసీసీబీ కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. 2021లో తాను డీసీసీబీ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టినప్పుడు బ్యాంకు టర్నోవర్ రూ.1300 కోట్లు ఉండేదని కేవలం రెండు సంవత్సరాలలోనే రూ.3వేల కోట్లకు తీసుకు వచ్చామన్నారు. రైతులతో పాటు డ్వాక్రా మహిళలకు, చిన్న వ్యాపారులకు, పాలు అమ్మకందారులకు, రైతులకు, వ్యవసాయ పనిముట్లకు, ట్రాక్టర్లకు, హార్వెస్టర్ల కొనుగోలుకు.. ఇలా అన్ని వర్గాల వారికి రుణాలు ఇస్తున్నామన్నారు. తాజాగా ఆర్‌బీఐ నుంచి కొత్త బ్రాంచ్‌లకు అనుమతి వచ్చిందన్నారు. త్వరలో ఎర్రగుంట్ల, ముద్దనూరు, రామేశ్వరం, బి.మఠంలో బ్రాంచ్‌లను ఏర్పాటు చేస్తామన్నారు. సొసైటీలను కూడా లాభాల బాటలోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రజాప్రతినిధులు కూడా వారి పేరుమీద, వారి పిల్లల పేరున బ్యాంకులో డిపాజిట్ చేసి ప్రజల్లో బ్యాంకు పట్ల మరింత నమ్మకం కలిగించాలన్నారు. డీసీసీబీ సీఈవో రాజేంద్రకుమార్ మాట్లాడుతూ తీసుకున్న రుణాలను తిరిగి సకాలంలో చెల్లిస్తే తక్కువ వడ్డీ పడుతుందన్నారు. అనంతరం డీసీసీబీ రూ.3వేల కోట్లు టర్నోవర్ సాధించిన సందర్భంగా డైరెక్టర్లు, అధికారులు, ఉద్యోగుల సమక్షంలో కేక్‌ను కట్‌చేసి ఆనందాన్ని పంచుకున్నారు.

అభివృద్ధి ప్రణాళికలపై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న డీపీవో ప్రభాకర్‌రెడ్డి

కడప(రూరల్), జనవరి 9: గ్రామ, మండల, జిల్లా స్థాయిలో 2024-25 అభివృద్ధి ప్రణాళికల తయారీకి సంబంధించి మంగళవారం జడ్పీ ఆవరణలోని డీపీఆర్‌సీ భవనంలో రెండురోజుల అవగాహన సదస్సు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీపీవో ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ-గ్రామ్ స్వరాజ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేసిన ప్రగతి నివేదికల మేరకే అభివృద్ధి పనులు చేపడతామన్నారు. ఆయా అధికారులు బాధ్యతగా విధులు నిర్వర్తించి గ్రామ స్థాయి పంచాయతీ అభివృద్ధి ప్రణాళికను గ్రామ పంచాయతీలు జనవరి 31లోపు, మండల స్థాయి అభివృద్ధి ప్రణాళికను మండల పరిషత్తు శాఖలు ఫిబ్రవరి 29 లోపు, జిల్లా స్థాయి ప్రణాళికను జిల్లా పరిషత్‌శాఖ మార్చి 31లోపు ఈ-గ్రామస్వరాజ్ పోర్టల్‌లో తప్పక నమోదు చేయాలన్నారు. ప్రణాళికబద్ధమైన కార్యాచరణతోనే గ్రామం, మండలం, జిల్లా అభివృద్ధి చెంది తద్వారా దేశ పురోభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. వివిధ స్థాయిలలో ప్రజల భాగస్వామ్యంతో మాత్రమే ప్రణాళికలను తయారుచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల జిల్లా అధికారులు, ఏవోలు, ఈవోపీఆర్‌డీలు, సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

ఆగని పోరు

- వినూత్నరీతిలో నిరసనలు



జమ్మలమడుగులో చేతులకు సంకెళ్లతో మున్సిపల్ కార్మికుల నిరసన



కడపలోని మహావీర్ సర్కిల్ వద్ద అంగన్వాడీల ఆందోళన



కడపలో అర్ధనగ్నంగా శరీరానికి ఆకులు చుట్టుకుని నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

కడప, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఇప్పటిదాకా సీఎం వైఎస్ జగన్ అంటే మొండోడు అని అనుకుంటూ వచ్చారు. జగన్‌కన్నా జగమొండి అంటూ అంగన్వాడీలు, మున్సిపాలిటీ వర్కర్లు పేరు తెచ్చుకుంటున్నారు. సమ్మె భగ్నానికి జగన్ అండ్ కో ఎన్ని ప్రయత్నాలు చేసినా భయపడం అంటూ పోరుబాట సాగిస్తున్నారు. ఇప్పుడు నీకు అవకాశం ఉంది మా మాటలు వినడంలేదు. మాకు టైం వస్తుంది, అప్పుడు మేమేందో చూపిస్తాం అంటూ జగన్ సర్కారుకు డైరెక్టుగానే వార్నింగ్ ఇస్తున్నారు. వెరసి జిల్లాలో అంగన్వాడీ, మున్సిపల్ కార్మికుల సమ్మె కొనసాగుతోంది.

తమ సమస్యలు పరిష్కరించాలంటూ అంగన్వాడీలు చేపట్టిన సమ్మె మంగళవారంతో 29వ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా కలెక్టరేట్ వద్ద చేపట్టిన రిలేదీక్షలకు ఏపీ అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు గుజ్జుల ఈశ్వరయ్య సంఘీభావం ప్రకటించారు. ఏపీ అంగన్వాడీ, ఆశా, సర్వశిక్ష అభియాన్, మధ్యాహ్నభోజన కార్మికులకు జగన్ హామీలు అమలు చేయాలని సమ్మె చేస్తుంటే సర్కారు పట్టించుకోకుండా ఎస్మా చట్టంతో నిషేధించడం ప్రభుత్వ నిరంకుశ విధానాన్ని చూపిస్తోందంటూ మండిపడ్డారు. సమస్య పరిష్కరించకపోతే జగన్ చరిత్రహీనుడిగా మారిపోతాడని హెచ్చరించారు. అంగన్వాడీ వర్కర్లు మహావీర్ సర్కిల్ వద్ద మానవహారంగా నిలబడి నిరసన తెలిపారు. జమ్మలమడుగులో పాతబస్టాండు వద్ద అంగన్వాడీలు మోకాళ్లపై నిరసన తెలిపారు. పోరుమామిళ్లలో జైల్‌భరో నిర్వహించారు. కొండాపురంలో చేతులకు బేడీలు వేసుకుని నిరసన తెలిపారు. బద్వేలు కూడలిలోనూ మానవహారం నిర్వహించారు.

ఇక మున్సిపల్ కార్మికుల సమ్మె మంగళవారంతో 15వరోజుకు చేరుకుంది. కడపలో ఒంటిపై ఆకులు కట్టుకుని అర్ధనగ్నంగా ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. అలాగే ప్రభుత్వ దిష్టిబొమ్మకు శవయాత్ర నిర్వహించి కోటిరెడ్డి సర్కిల్‌లో దహనం చేశారు. మైదుకూరులో అర్ధనగ్నంగా ఒంటికాలిపై నిలబడి నిరసన తెలిపారు. ప్రొద్దుటూరు, బద్వేలు, జమ్మలమడుగులో చేతులకు సంకెళ్లతో ఆందోళన చేశారు.



విజయవాడలో మంగళవారం జరిగిన కేంద్ర ఎన్నికల సంఘం సమావేశంలో పాల్గొన్న అన్నమయ్య, కడప జిల్లాల కలెక్టర్లు పీఎస్ గిరీషా, విజయరామరాజు, ఎస్పీలు కృష్ణారావు, సిద్ధార్థ కౌశల్

19న చంద్రబాబు బహిరంగ సభ



స్థల పరిశీలన చేస్తున్న టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా

కమలాపురం(కడప ఎన్జీఓఆర్‌సర్కిల్), జనవరి 9: వైసీపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు చేపడుతున్న 'తెలుగుదేశం పిలుస్తోంది రా.. కదలిరా' కార్యక్రమంలో భాగంగా ఈ నెల 19వ తేదీ కమలాపురంలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. కడప పార్లమెంటు స్థాయిలో జరుగుతున్న ఈ సభకు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో కమలాపురం పట్టణంలోని సీఎస్‌ఐ చర్చి గ్రౌండ్ స్థలాన్ని, హెలిప్యాడ్‌ను టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి పుత్తా నరసింహారెడ్డి మంగళవారం పరిశీలించారు. స్థల పరిశీలనలో నియోజకవర్గంలోని టీడీపీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

ఇలా వచ్చారు... అలా వెళ్లారు

- అరకొరగా సమస్యలపై చర్చ
- నెడ్‌క్యాప్‌పై చర్చ కేవలం నిమిషం మాత్రమే
- మొక్కుబడిగా జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశం

కడప(రూరల్), జనవరి 9: జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశం మంగళవారం జడ్పీ సమావేశహాలులో నిర్వహించారు. ఆయాశాఖల జిల్లా అధికారులు నిర్దేశించిన సమయానికి వచ్చినప్పటికీ చైర్మన్ అమరనాథరెడ్డి రాకపోవడంతో ఉదయం 10 గంటలకు ప్రారంభించాల్సిన సమావేశం 10-40 గంటలకు ప్రారంభించి మధ్యాహ్నం 1-10 గంటలకు ముమ అనిపించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ఇలా వచ్చి అలావెళ్లారు. సమావేశం ప్రారంభం నుంచి ఒక్కొక్కశాఖకు 10 నిమిషాల వ్యవధికూడా కేటాయించకుండా పరుగో...పరుగు అన్నట్లుగా సాగించారు. మొత్తంగా 7 స్టాండింగ్ కమిటీ సమావేశాలను ఒకేచోట ఒకదాని తరువాత ఒకటి టకటకా నిర్వహించి ఓ పనైపోయిందనిపించారు.

- మొదటగా పంచాయతీరాజ్‌శాఖపై చర్చసాగించి 10 నిమిషాలకే ముగించేశారు. పోరుమామిళ్ల జడ్పీటీసీ చెన్నయ్య సచివాలయాల పనులకు బిల్లులను చెల్లించడంలేదని, కో-ఆప్షన్ సభ్యుడు ఎ.ఖరీముల్లా ఖాజీపేట బైపాస్‌లోని పీఆర్ రోడ్డు పనులను చేపట్టాలని కోరారు. వీటిపై ఎస్ఈ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రూ.12 కోట్ల బిల్లులు ఆప్‌లోడ్ అయ్యాయని వీలైనంత త్వరలో చెల్లిస్తామని చెప్పారు.
- ఆర్‌డబ్ల్యుఎస్ శాఖపై 10-49 నుంచి 10-52 వరకు కేవలం 3 నిమిషాలు మాత్రమే చర్చించారు. ఈ వ్యవధిలో జడ్పీ చైర్మన్ వేసవికాలం వస్తోందని నీటి ఎద్దడి లేకుండా తగు చర్యలు చెపట్టాలన్నారు. కో-ఆప్షన్ సభ్యుడు శ్మశాన వాటికల్లోని బోరుబావులకు హ్యాండ్‌పంప్‌లు ఏర్పాటు చేయాలన్నారు.
- సీపీవో శాఖపై 10-52 నుంచి 10-55 వరకు కేవలం 3 నమిషాలపాటు సాగించిన చర్చలో పోరుమామిళ్ల జడ్పీటీసీ చెన్నయ్య గడప గడప కార్యక్రమం ద్వారా మంజూరైన కొన్ని పనులు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని ఇప్పుడు చేపట్టడానికి వీలుపడుతుందా అని అడిగారు.
- మైనింగ్‌శాఖపై చర్చను 10-55 నుంచి 11-00 వరకు కేవలం 5 నిమిషాలు నిర్వహించగా జడ్పీ సీఈవో సుధాకర్‌రెడ్డి జడ్పీకి శాండ్ ద్వారా వచ్చే సీనరైజ్ గ్రాంట్‌ను జమచేయడంలేదని, పోరుమామిళ్ల జడ్పీటీసీ చెన్నయ్య జగనన్న కాలనీలకు ఇసుక సరఫరా కావడంలేదని అన్నారు.
- జిల్లా రిజిస్ట్రేషన్ శాఖపై 11-00 నుంచి 11-06వరకు కేవలం 6 నిమిషాల పాటు చర్చ సాగించారు.
- డీఆర్‌డీఏ శాఖపై 11-06 నుంచి 11-10 వరకు కేవలం 4 నిమిషాలు చర్చించగా బి.కోడూరు జడ్పీటీసీ దావీద్, పోరుమామిళ్ల జడ్పీటీసీ చెన్నయ్యలు కొత్తవారికి పింఛన్ నిధులు ఇవ్వడం లేదన్నారు.
- డ్వామాశాఖ గురించి 11-10 నుంచి 11-14 వరకు 4 నిమిషాలపాటు చర్చ సాగించారు. పోరుమామిళ్ల జడ్పీటీసీ మాట్లాడుతూ రైతులకు వేసిన బోరుబావులకు కరెంట్ సప్లై ఎప్పుడిస్తారో ఏమో తెలియడంలేదన్నారు. శ్మశానాలకు గ్రావెల్ రోడ్లను మంజూరు చేయాలని గత సమావేశాల నుంచి అడుగుతున్నా పట్టించుకోవడంలేదన్నారు.
- హౌసింగ్ శాఖపై 11-14 నుంచి 11-20 వరకు 6 నిమిషాలపాటు సాగించిన చర్చలో పలు జగనన్న కాలనీలకు వెళ్లే రోడ్లు కనీసం బైకులు కూడా వెళ్లడానికి వీలులేకుండా అధ్వాన్నంగా ఉన్నాయని, కొన్ని చోట్ల అప్రోచ్ రోడ్లు వేశారు ఇంతవరకు బిల్లులు చెల్లించలేదని పోరుమామిళ్ల జడ్పీటీసీ పేర్కొన్నారు.
- సెప్ శాఖపై 11-20 నుంచి 11-25 వరకు కేవలం 5 నమిషాలపాటు చర్చించారు.
- జిల్లా కో-ఆపరేటివ్‌శాఖపై 11-25 నుంచి 11-34 వరకు 9 నిమిషాలపాటు చర్చించగా ఇందులో అధిక సమయం ప్రగతి నివేదికను జిల్లా అధికారి చదివి వినిపించారు.
- నెడ్‌క్యాప్‌పై చర్చ 11-34 నుంచి 11-35 వరకు కేవలం ఒక్క నిమిషంపాటే కొనసాగించారు.
- ఇరిగేషన్, సర్వశిక్ష అభియాన్‌లను 11-36 నుంచి ఒకేసారి నిర్వహించారు.
- తరువాత నిర్వహించిన వ్యవసాయ, అనుబంధశాఖలకు సంబంధించిన చర్చలో ఇటీవలన వచ్చిన తుఫాను కారణంగా ఖాజీపేట మండలంలో 1542 హెక్టార్లు వరి పంట దెబ్బతిన్నట్లు అధికారులు గుర్తించారని కాగా ప్రభుత్వానికి మాత్రం కేవలం 709 హెక్టార్లలో మాత్రమే పంట నష్టపోయినట్లు పుటప్ చేయడమేంటని ప్రశ్నించారు. మండలం నుంచి వచ్చిన నివేదికలనే తాము పుటప్ చేశామని జేడీ నాగేశ్వరరావు తెలిపారు. వెంటనే కో-ఆప్షన్ సభ్యులు సమావేశం నుంచే మండల ఏవోకు ఫోన్‌చేయగా తహశీల్దార్ చుక్కల భూములు, డీకేటీ భూములను తొలగించారని సమాధానం ఇచ్చారు.




స్టాండింగ్ కమిటీ సమావేశాలలో అధికారులతో సమీక్షిస్తున్న జడ్పీ చైర్మన్

ఉద్యాన పంటలపై ఆసక్తి

- గతంలో వర్షాధార పంటలు సాగు
- ప్రస్తుతం బోరుబావులను నమ్ముకుంటున్న రైతులు
- టీడీపీ ప్రభుత్వంలో సబ్సిడీపై డ్రిప్, స్పింకర్లు
- ఈ ప్రభుత్వంలో వ్యవసాయం దండగే..
- ప్రభుత్వ ప్రోత్సాహం కోసం ఎదురుచూపు

ఒకప్పుడు ఈ ప్రాంతం కరువు కాటకాలకు నిలయం. రెక్కాడితే కానీ డొక్కాడని పరిస్థితి. గతంలో పల్లె ప్రజలందరూ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవారు. కానీ రాను రానూ కాలం మారింది. వ్యవసాయ విధానం, ప్రజల జీవన విధానంలోనూ మార్పు వచ్చింది. గతంలో వర్షాధార పంటలైన వరి, వేరుశనగ, కంది, ఉలవ, అలసంద, రాగి, సజ్జ వంటి పంటలను సాగు చేసేవారు. నేడు వర్షాధారంపై ఆధారపడకుండా రైతులు బోరుబావులను నమ్ముకుంటున్నారు. బొప్పాయి, అరటి, జామ, నిమ్మ, మామిడి, సపోట, డ్రాగన్ ఫ్రూట్స్, కర్జూరం వంటి పంటలతో పాటు కూరగాయ పంటలైన టమోటా, వంకాయ, బెండ, మిరప, అనప వంటి పంటల సాగుపై రైతులు ఆసక్తి చూపిస్తున్నారు. అయితే గత ప్రభుత్వంలో సబ్సిడీపై పరికరాలు ఇచ్చేవారు. ఈ ప్రభుత్వం రైతులకు ఎటువంటి సాయం చేయడం లేదని పలువురు అంటున్నారు.


పేరంపల్లెలో సాగులో ఉన్న బొప్పాయి


కొర్లకుంటలో సాగు చేసిన కర్జూర పంట

గాలివీడు, జనవరి 9: రాయచోటి డివిజన్ పరిధిలోని గాలివీడు, లక్కిరెడ్డిపల్లె, రామాపురం, చిన్నమండెం, సంబేపల్లె, వీరబల్లి, సుండుపల్లె, రాయచోటి రూరల్ మండలాల పరిధిలో టమోటా 200 ఎకరాలు, బొప్పాయి 60 ఎకరాలు, వంకాయ 70 ఎకరాలు, దోస, కర్బూజ 120 ఎకరాలు, డ్రాగన్ ఫ్రూట్స్ 12 ఎకరాలు, అరటి 15 ఎకరాలు, కర్జూరం 10 ఎకరాల్లో ప్రస్తుతం రైతులు సాగు చేస్తున్నారు. వీటితో పాటు మిరప 20 ఎకరాలు, పొదిన, కొత్తిమీర 10 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. అయితే ఈ పంటలను సాగు చేయడానికి ఖర్చు ఎక్కువ వస్తున్నదని రైతులు చెబుతున్నారు. బొప్పాయి ఒక ఎకరా సాగు చేసేందుకు అన్ని ఖర్చులకు గానూ రూ.1.70 లక్షలు ఖర్చు అవుతుందని, మిరప ఎకరాకు రూ.70 వేలు, టమోటా ఎకరాకు రూ.లక్ష ఖర్చు అవుతున్నదని రైతులు తెలిపారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు టమోటా, బొప్పాయి సాగు చేసుకోవడానికి రైతులకు ఒక ఎకరాకు రూ.30 వేలు, ఇతర పంటలకు 90 శాతం సబ్సిడీతో డ్రిప్, స్పింక్లర్లు, పోషకాలు వంటివి రైతులకు అందజేసేవారని, పంటల దిగుబడి తగ్గిపోయినప్పుడు ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్ వంటివి అందించి రైతులను ఆదుకొన్నారని రైతులు అంటున్నారు. కానీ నేడు రైతులు సాగు చేసే పంటలకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సబ్సిడీలు కానీ, నష్టపరిహారాలు కానీ అందించలేదని చెబుతున్నారు. గత టీడీపీ ప్రభుత్వం మోటార్లు, పైపులు, ఆయిల్ ఇంజన్లు, ఎరువులు వంటి వాటిని కూడా రైతులకు అందించిందని తెలిపారు. గతంలో వరి, వేరుశనగ, కంది, ఉలవ వంటి పంటను సాగు చేయడం వల్ల తీవ్రంగా నష్టపోయామని, వాటి స్థానంలో ప్రత్యామ్నాయ పంటలను సాగు చేస్తున్నాము. అయితే ఇటీవల పంట సాగులో కూడా ఖర్చు ఎక్కువ అవుతున్నదని తెలిపారు. గతంలో పోల్చితే ఎరువులు, కూలీల రేట్లు, ట్రాక్టర్ బాడుగలు రెండింతలు పెరిగాయని, కానీ పంటల ధరలు మాత్రం పెరగలేదని తెలిపారు. ప్రభుత్వం స్పందించి ప్రత్యామ్నాయ పంటను సాగు చేస్తున్న రైతులకు ప్రోత్సాహకాలు అందిస్తే ఎక్కువ విస్తీర్ణంలో పంటలను సాగు చేస్తామని పలువురు రైతులు పేర్కొంటున్నారు.


నూలివీడులో సాగు చేసిన వంకాయ తోట

నూతన పంటలను సాగు చేస్తున్నా..



నేను గత కొంత కాలంగా వరి, వేరుశనగ పంటలను సాగు చేస్తూ ఉండేవాడిని. కానీ ఈ పంటల వల్ల గిట్టుబాటు రాకపోవడంతో వీటి స్థానంలో ఈ ఏడాది 12 ఎకరాల్లో బొప్పాయిని సాగు చేస్తున్నాను. ఒక ఎకరా బొప్పాయి సాగుకు రూ.1.50లక్షల ఖర్చు అవుతున్నది. ఇంకో రెండు నెలలకు కోతకు వస్తుంది. బొప్పాయికి తెగుళ్లు ఎక్కువగా సోకుతాయి కాబట్టి ప్రతిరోజూ పంటను పరిశీలించాలి. ఈ ప్రాంతంలో బొప్పాయి మార్కెట్ సౌకర్యం లేదు. బెంగుళూరు, చెన్నై, ముంబాయి వంటి నగరాల్లో వీటిని ఎగుమతి చేయాల్సి వస్తుంది.

- గీదర ధర్మారెడ్డి, రైతు, పేరంపల్లె

మార్కెట్ సౌకర్యం కల్పించాలి..



నేను రెండు ఎకరాల్లో వంకాయను సాగు చేశాను. ఒక ఎకరా సాగు చేసేందుకు రూ.లక్ష అవుతున్నది. వంకాయ సాగుకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రోత్సాహకం లేదు. గత ప్రభుత్వం సబ్సిడీ రూపంలో డ్రిప్, పైపులు అందించేవి. ఈ ప్రభుత్వం రైతులకు ఎలాంటి సాయం చేయలేదు. పండించిన వంకాయ చెన్నైకి తీసుకెళ్లేందుకు బాడుగలు ఎక్కువుగా అవుతున్నాయి. ఖర్చు ఎక్కువ, ఆదాయం తక్కువగా ఉంది. కొన్ని సందర్భాల్లో గిట్టుబాటు ధర లేకపోవడంతో కాయలు తోటల్లోనే వదిలేస్తున్నాం. ప్రభుత్వం మార్కెట్ సౌకర్యం కల్పించాలి.

- మోపూరి రమణయ్య, రైతు, గుండ్లచెరువు

పుట్టగొడుగుల పెంపకం లాభదాయక వనరు

- తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు
- వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు చింతా సుధాకర్


మాట్లాడుతున్న వైస్‌చాన్సలర్ చింతా సుధాకర్

కడప (ఎర్రముక్కపల్లె), జనవరి 9: లాభదాయక వనరు అయిన పుట్టగొడుగుల పెంపకంతో భవిష్యత్తు పారిశ్రామవేత్తలుగా ఎదిగేందుకు విస్తృత అవకాశాలున్నాయని వైవీయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసరు చింతా సుధాకర్ తెలిపారు. మంగళవారం వైవీయూ బయోటెక్నాలజీ శాఖ మిల్కీ మష్రూమ్స్ సాగు అనే అంశంపై ఒక రోజు సెమినర్‌ను కన్వీనరు ప్రొఫెసరు చంద్రమతి శంకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ చాన్సలర్ మాట్లాడుతూ దేశంలో 80 శాతం ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి జీవస్తున్నారన్నారు. పంట సాగు కోసం చేసిన సొమ్ము రావడమే గగనం అయిపోతున్న తరుణంలో తక్కువ సమయం, పెట్టుబడితో ఎక్కువ ఆదాయం పొందేందుకు పుట్టగొడుగుల పెంపకం సరైనదని వివరించారు. ఈ వర్క్‌షాపును రైతులు, విద్యార్థులు, గ్రామీణులు సద్వినియోగం చేసుకుని చిన్నతరహా పరిశ్రమలు స్థాపించాలని కోరారు.

ప్రిన్సిపల్ రఘునాథరెడ్డి మాట్లాడుతూ 1970కి ముందు కోళ్ల పరిశ్రమ లేదని ఆ తరువాత సుందరనాయుడు అనే వ్యక్తి ప్రారంభించారన్నారు. ఇది ఇప్పుడు పెద్ద పరిశ్రమగా నెలకొల్పబడిందన్నారు. ఎస్‌బీఐ మేనేజరు సుధాకర్ మాట్లాడుతూ ఆసక్తి గల యువతకు రుణాలు ఇచ్చి పారిశ్రామికవేత్తలుగా మార్చడానికి ఎస్‌బీఐ ఎప్పుడూ సిద్ధంగా ఉందన్నారు. అగ్రి కమర్షియల్ బ్యాంకు అనే ప్రత్యేక విభాగం ఉందన్నారు.

ప్రొఫెసరు చంద్రమతి శంకర్ బయోటెక్నాలజీ గురించి వివరించారు. సహాయ కన్వీనరు చంద్రశేఖర్, అధ్యాపకులు విమల, డాక్టర్ విఘ్నేశ్వర్‌రెడ్డి, కళ్యాణ్‌చక్రవర్తి, ఎన్.శ్రీనివాసరావు, రైతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బకాయిలు అడిగితే నిర్బంధించడం న్యాయమా?

- యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న యూటీఎఫ్ నాయకులు

కడప (ఎడ్యుకేషన్), జనవరి 9: ఉద్యోగ ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన రూ.18వేల కోట్ల బకాయిలు చెల్లించాలని ప్రజాస్వామిక పద్ధతిలో పోరాటం చేస్తున్న యూటీఎఫ్ ప్రతినిధులను నిర్బంధించడం న్యాయమా అని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా విమర్శించారు. కడప నగరం కలెక్టరేట్ ఎదుట ఆర్థిక బకాయిలు చెల్లించాలని మంగళవారం సాయంత్రం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయులను అప్రజాస్వామికంగా నిర్బంధించినందుకు ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని విమర్శించ రు. తమకు ఇవ్వాల్సిన బకాయిలు ప్రభుత్వ బడ్జెట్ నుంచి చెల్లించాల్సిన డబ్బు కాదని, తమ జీతాల నుంచి దాచుకున్న డబ్బులు చెల్లించాలని కోరారు. బకాయిలన్నీ సెప్టెంబరు 23లోపు చెల్లిస్తామని ఆగస్టులో జరిగిన జాయింట్ శాప్ కౌన్సిల్ సమావేశంలో మంత్రులు, అధికారులు చెప్పినా ఇంతవరకు ఒక్క పైసా కూడా జమ చేయకపోవడం దుర్మార్గమన్నారు. ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వం ఎందుకు కక్షపూరితంగా వ్యవహరిస్తుందో చెప్పాలన్నారు. ఎవరికీ లేని 144 సెక్షన్, 30 యాక్టు ఉపాధ్యాయులకేనా అని ప్రశ్నించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో చర్చలు జరిపి వెంటనే ఉపాధ్యాయ డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. లేదంటే భవిష్యత్తులో ఈ ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు నరసింహారావు, సీవీ రమణ, ఎజాజ్ అహ్మద్, రూత్ ఆరోగ్యమేరీ, ప్రభాకర్, దేవదత్తం, సత్తార్ ఫైజి, చెన్నకేశవులు పాల్గొన్నారు.

అభివృద్ధి ప్రణాళికలు పకడ్బందీగా రూపొందించాలి


శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న డీపీవో ధనలక్ష్మి

రాయచోటిటౌన్, జనవరి 9: గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలను పకడ్బందీగా రూపొందించాలని జిల్లా పంచాయతీ అధికారిణి ధనలక్ష్మి పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (జీపీడీపీ) తయారు చేసేందుకు జిల్లా పంచాయతీ అధికారి ఆధ్వర్యంలో అధికారులకు రెండు రోజుల శిక్షణా కార్యక్రమంలో భాగంగా మంగళవారం మొదటిరోజు రాయచోటి పట్టణ పరిధిలోని భాస్కర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ కళాశాలలో విజయవంతంగా జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రణాళికాబద్ధమైన కార్యాచరణతోనే దేశ అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. అభివృద్ధి ప్రణాళికలను తయారు చేసుకునే బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకే కాకుండా స్థానిక ప్రభుత్వాలైన గ్రామ పంచాయతీ, మండల ప్రజా పరిషత్, జిల్లా ప్రజాపరిషత్‌లకు కూడా ఉందన్నారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించడమే ప్రధాన లక్ష్యంగా గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలను తయారు చేయాలన్నారు. అనంతరం సీనియర్ ఫాకల్టీ మమత జీపీడీపీ ప్రణాళిక ముఖ్య ఉద్దేశ్యాన్ని వివరించారు. డీఆర్‌డీఏ, ఎస్ఈఆర్‌డబ్ల్యుఎస్, డీడీసోషల్ వెల్ఫేర్, డీటీవో, బీసీ వెల్ఫేర్ తదితర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాంగణ ఎంపికల్లో కేఎస్ఆర్ఎం విద్యార్థుల ప్రతిభ


ప్రాంగణ ఎంపికల్లో ప్రతిభ చాటిన విద్యార్థులతో కేఎస్ఆర్ఎం కమిటీ, మేనేజింగ్ డైరెక్టర్ కందుల చంద్ర ఓబుళరెడ్డి (నాని) తదితరులు

సికెదిన్నె, జనవరి 9: ప్రాంగణ ఎంపికల్లో కేఎస్ఆర్ఎం విద్యార్థులు ప్రతిభ చాటారని కళాశాల ప్రిన్సిపల్ వీఎస్ఎస్ మూర్తి తెలిపారు. బీటెక్ చివరి సంవత్సరం చదువుతున్న, 2024లో ఉత్తీర్ణులైన సివిల్, మెకానికల్, ఈఈఈ చదువుతున్న విద్యార్థులు తమ ప్రతిభ చాటి మెగా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ హైదరాబాదు వారు శుక్రవారం నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో ఎంపికయ్యారని తెలిపారు.


ఇందులో 42 మంది సివిల్, 20 మంది మెకానికల్, ముగ్గురు ఈఈఈ విద్యార్థులు మొత్తం 65 మంది ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైనవారికి ట్రైనింగ్ కాలంలో సంవత్సరానికి రూ.2.3 లక్షలు, ట్రైనింగ్ పూర్తయి బీటెక్ సర్టిఫికెట్లతో వచ్చినవారికి రూ.5లక్షలు వేతనం ఉంటుందన్నారు. ట్రైనింగ్ పీరియడ్‌లో ఉచిత భోజనం, రవాణా సదుపాయాలు ఉంటాయన్నారు. ఎంపికైన విద్యార్థులను కరస్పాండెంట్ కందుల రాజేశ్వరమ్మ, వైస్‌చైర్మన్ కందుల చంద్రమోహన్‌రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ కందుల చంద్ర ఓబుళరెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ ప్రేమ్‌కుమార్‌లు అభినందించారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధిపతులు ఎంపికైన విద్యార్థులు పాల్గొన్నారు.

13న జూనియర్స్ బాల, బాలికల జిల్లా కబడ్డీ జట్ల ఎంపిక

కడప (స్పోర్ట్స్) జనవరి 9: నగర డీఎస్ఏ ఔట్‌డోర్ స్టేడియంలో ఈనెల 13వ తేదీ శనివారం ఉదయం 10 గంటలకు జూనియర్స్ బాల, బాలికల జిల్లా కబడ్డీ జట్ల ఎంపిక ప్రక్రియ జరుగనున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ ఆర్.వెంకటసుబ్బయ్య, వర్కింగ్ సెక్రటరీ టి.శ్రీవాణి తెలిపారు. ఎంపికలకు హాజరయ్యే బాల, బాలికలు 2024 ఫిబ్రవరి 4వ తేదీ నాటికి 20 సంవత్సరాల లోపు వుండాలన్నారు. బరువు అబ్బాయిలు 70 కేజీల లోపు, అమ్మాయిలు 65 కేజీల లోపు వుండాలన్నారు. ఎంపికలకు హాజరయ్యే వారు ఆధార్‌కార్డు జిరాక్స్ తప్పనిసరిగా తీసుకురావాలన్నారు.

ఎంపికైన వారు ఈనెల 20 నుంచి 23 వరకు నంద్యాల పద్మావతినగర్‌లోని ఇండోర్ స్టేడియంలో జరుగనున్న రాష్ట్రస్థాయి జూనియర్స్ బాల,బాలికల కబడ్డీ పోటీలలో పాల్గొనాల్సి వుంటుందన్నారు. ఇతర వివరాలకు 9949304160 అనే నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

మరో రైల్వే ప్రయాణికుడికి గాయాలు


గాయపడ్డ వ్యక్తి, చికిత్సకు తరలిస్తున్న దృశ్యం


ఎర్రగుంట్ల, జనవరి 9: ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్‌లో రెండు నెలల క్రితం ప్రహరీగోడ ఎక్కి రైల్వేస్టేషన్‌లోకి వస్తూ ఓ ప్రయాణికుడు డ్రైనేజి గుంతలో పడి మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ సంఘటన మరువక ముందే మంగళవారం రాత్రి మరో ప్రయాణికుడు ప్రహరీ ఎక్కి దిగుతూ కిందపడిన సంఘటనలో తీవ్ర గాయాలయ్యాయి. ప్రొద్దుటూరు ఎర్రన్న గొట్లాలకు చెందిన నాగయ్య దైవదర్శనం కోసం వెళుతూ రైలెక్కేందుకు వచ్చాడు. ప్లాట్‌ఫారంకు వెళ్లేందుకు ఒకిన్నర కిలోమీటర్ దూరం తిరిగిరా లేక... ప్రొద్దుటూరు బస్టాప్ వద్ద నున్న ప్రహరీని ఎక్కిదిగే ప్రయత్నం చేశాడు. అక్కడ మెట్లు లేకపోవడం.. ప్రహరీకి పేర్చిన రాళ్లు తొసగడంతో కింద పడ్డారు. దీంతో అతని నడుము, కాలికి గాయాలయ్యాయి. కదల్లేని స్థితిలో ఉన్న అతను తన బంధువులకు ఫోన్ చేయడంతో వారు అక్కడికి చేరుకుని స్థానికుల సహాయంతో ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు. ఇక్కడ తరచూ రైల్వేప్రయాణికులు ప్రమాదాలబారిన పడుతున్నా రైల్వే యాజమాన్యం పట్టించుకోకపోవడం పట్ల వారు మండిపడుతున్నారు.

రేషన్ బియ్యం పట్టివేత


పట్టుబడ్డ వాహనంతో విజిలెన్స్ అధికారులు

వేంపల్లె, జనవరి 9: వేంపల్లెలో విజిలెన్స్ అధికారులు దాడులు చేసి అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. విజిలెన్స్ సీఐ రెడ్డప్ప, అసిస్టెంటట్ జియాలజిస్ట్ శ్రీనివాసులు, ఆర్ఐ లోకేష్, హెడ్ కానిస్టేబుల్ జనార్దన్‌రావు, హరినాథరెడ్డి అకస్మికంగా తనిఖీ చేసి వాహనంతో పాటు 36 బియ్యం బస్తాలను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని అదుపులోకి తీసుకొని స్థానిక పోలీసులకు అప్పగించారు.

ఉరివేసుకుని యువకుడు ఆత్మహత్య


వెంకట్రమణ మృతదేహం

సంబేపల్లె, జనవరి 9: మండల పరిధిలోని సంబేపల్లె గ్రామం కృష్ణబాబునగర్‌కు చెందిన కటారు వెంకట్రమణ (30) సోమవారం రాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల వివరాల మేరకు... వెంకట్రమణ ఇంట్లో ఉరి వేసుకోగా.. గమనించిన కుటుంబ సభ్యులు గుర్తించి 108 వాహనం ద్వారా రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించగా అప్పటికే మృతి చెందాడు. పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు. మృతుడు ట్రాక్టర్ డ్రైవర్‌గా జీవనం సాగించే వాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా, పోలీసులు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి


మృతిచెందిన రమేష్

సికెదిన్నె, జనవరి 9: పెండ్లిమర్రి మండలం మిట్టమీదపల్లె గ్రామానికి చెందిన చిన్నాయిపల్లె రమేష్ (24) అనే యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఎస్ఐ శ్రీనివాసులరెడ్డి వివరాల మేరకు.. రమేష్ తన స్నేహితుడు వెంకటసుబ్బయ్యతో కలిసి బైకులో కడపకు వెళ్లారు. పని ముగించుకుని మంగళవారం రాత్రి ఇంటికి వెళుతుండగా ఎర్రమాచుపల్లె బ్రిడ్జి సమీపంలోకి రాగానే చీకటిలో ఎదురుగా వస్తున్న సైకిల్ కనపడక తగిలించి బైకు అదుపు తప్పి కిందపడ్డారు. దీంతో రమేష్ తలకు బలమైన గాయాలై స్పృహ తప్పి పడిపోయాడు. స్థానికులు చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ప్రమాదంలో గాయపడిన వెంకటసుబ్బయ్య, మరో వ్యక్తి చికిత్స పొందుతున్నారు. వెంకటసుబ్బయ్య తండ్రి వెంకటయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి


షేక్ అమీర్‌బాష మృతదేహం

ఓబులవారిపల్లె, జనవరి 9: జాతీయ రహదారి దాటుతున్న వ్యక్తిని వ్యాన్ ఢీకొనడంతో షేక్ అమీర్‌బాష (65) అనే వ్యక్తి మృతి చెందాడు. సోమవారం రాత్రి కొర్లకుంట గ్రామానికి చెందిన అమీర్‌బాషా కొర్లకుంట క్రాస్ వద్ద రోడ్డు దాటే క్రమంలో వాహనం ఢీకొనడంతో గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం రైల్వేకోడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఆగి ఉన్న లారీని ఢీకొని యువకుడు మృతి


మృతుడు నరేశ్


నరేశ్ (ఫైల్)

సంబేపల్లె, జనవరి 9: కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారిలోని మోటకట్ల విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదురుగా మంగళవారం రాత్రి ఆగి ఉన్న లారీని ఢీకొన్న సంఘటనలో గోటూరి నరేశ్ (19) అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.... సంబేపల్లె మండలం దేవపట్ల గ్రామం బంకాడపల్లెకు చెందిన నరేశ్ రాయచోటి ఏజీ గార్డెన్‌లో ఉంటున్నాడు. ద్విచక్ర వాహనంలో రాయచోటి నుంచి తన స్వగ్రామానికి వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో నరేశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి నారాయణ 5 సంవత్సరాల క్రితం ఆరోగ్యంతో మృతి చెందాడు తల్లి దేవి జీవనోపాధి కోసం కువైట్‌లో ఉంటోంది. ప్రమాద విషయం తెలుసుకున్న బంధువులు సంఘటన స్థలానికి చేరుకొని బోరుమని విలపించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రోడ్డుపై ఆగి ఉన్న లారీకి ఇండికేటర్స్ వేయకపోవడం, పెట్రోలింగ్ టీం నిర్లక్ష్యం వల్లే ఓ నిండు ప్రాణం బలైనట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు.

ప్రపంచ పర్యాటక పటంలో గండికోట


గండికోట ఫొటోలను ఆవిష్కరిస్తున్న పర్యాటక సంస్థల ప్రతినిధులు

కడప (ఎడ్యుకేషన్), జనవరి 9: ప్రపంచ పర్యాటక పటంలో గండి కోటకు శాశ్వత స్థానం లభించిదని వక్తలు తెలిపారు. మంగళవారం కడప నగరం ప్రభుత్వ పురుషుల కళాశాలలో గండికోట 901 ఆవిర్భావ దినోత్సవాన్ని కళాశాల పర్యాటక విభాగం బాధ్యులు ఎన్.శివపార్వతి, రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఇంటాక్ జిల్లా చాప్టరు కన్వీనరు చిన్నపరెడ్డి, గండికోట రాజవంశీకులు పెంబసాని ప్రభాకర్‌నాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం గండికోట అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించడం హర్షణీయమన్నారు. అనంతరం వేంపల్లె డిగ్రీకళాశాల చరిత్ర అధ్యాపకులు బాలగొండ గంగాధర్ మాట్లాడారు. కార్యక్రమంలో పలువురు వక్తలు, ప్రతినిధులు పాల్గొన్నారు.

డ్రైవరు, డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టులకు జాబ్‌మేళా

● చివరి తేదీ ఈ నెల 20

కడప (క్రైం), జనవరి 9 : ఏఈఎంఎస్ 104, డాక్టర్ వైఎస్ఆర్ తల్లి బిడ్డ వాహనాల్లో డ్రైవరు, డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టులకు దరఖాస్తులు అందించాలని నిర్వాహకులు తెలిపారు. కడప నగరంలోని ఓల్డ్ రిమ్స్‌లో ప్రతి రోజూ ఉదయం 9.30 నుండి సాయంత్రం 5 వరకు ఈ నెల 20వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నార న్నారు. అభ్యర్థులు తమ బయోడేటా ఒరిజినల్, జిరాక్స్ సర్టిఫికెట్లు, బ్యాంకు అకౌంటు, 4 ఫోటోలతో హాజరు కావాలన్నారు. డేటా ఎంట్రీ ఆపరేటరుకు డిగ్రీ మరియు కంప్యూటర్ నాలెడ్జ్ డ్రైవరుకు టెన్త్ పాస్, హెవీ లైసెన్సు అవసరమన్నారు. ఎంపికైన వారు వైఎస్ఆర్ కడప, అన్నమయ్య జిల్లాల్లో పనిచేయాల్సి ఉంటుందన్నారు.

విలేకరులకు ప్రమాద బీమా

● సాయినాథ్‌శర్మ సొంత నిధుల నుంచి ప్రీమియం

కమలాపురం (కడప ఎన్జీఆర్ సర్కిల్), జనవరి 9: కమలాపురం పట్టణానికి చెందిన టీడీపీ రాష్ట్ర మాజీ కార్యదర్శి పుణ్యభూమి చారిటబుల్ ట్రస్టు చైర్మన్ కాశీభట్ల సత్యసాయినాథశర్మ విలేకరులకు ప్ర మాద బీమా పథకాన్ని అందిస్తున్నారు. నియోజకవర్గంలో ని అన్ని మండలాల ఎలక్ట్రానిక్ అండ్ ప్రింట్ మీడియా మిత్రులకు, ఒక్కొక్కరికి రూ.10లక్షల విలువ చేసే ప్ర మాద బీమా తన సొంత నిధులతో చేయిస్తున్నారు. ఇం దుకుగాను ఒక్కొక్కరికి ఏడాదికి రూ.650 చొప్పున ఇప్ప టికి 70 మందికి చెల్లించారు. నియోజకవర్గ పరిధిలోని కమలాపురం, సీకేదిన్నె, చెన్నూరు, వీఎన్‌పల్లె, వల్లూరు, పెండ్లిమర్రి మండలాల విలేకరులకు అండగా ఉంటామని ఆయన పేర్కొన్నారు.

ఎంబీఏ విద్యార్థుల పరిశ్రమల సందర్శన

కడప (ఎడ్యుకేషన్), జనవరి 9 : వైవీయు ఎంబీఏ విద్యార్థులు క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా పులివెందుల నగరం గోవిందరావు టెక్స్‌టైల్స్ సందర్శించారు. వైస్‌ఛాన్సలర్ చింతా సుధాకర్ క్షేత్రసర్యటనకు వెళ్లేవిద్యార్థుల కోసం జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ క్షేత్ర పర్యటన ద్వారా ప్రత్యక్ష పరిశీలన చేసి అక్కడికక్కడేసందేహాలు నివృత్తి చేసుకవాలన్నారు. ఎంబీఏ హెచ్‌వోడి డాక్టర్‌మృత్ ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రొఫెసరు సుబ్బరాయుడు, అసిస్టెంటు ప్రొఫెసరు వర ప్రభాకర్, సుబ్బారెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎస్టీయూ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

కడప (ఎడ్యుకేషన్), జనవరి 9 : ఎస్టీయూ 75 వసంతాలు పూర్తి చేసుకుని వైభవంగా వజ్రోత్సవ వేడకలు ఘనంగా నిర్వహించుకుంటున్న సందర్భంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రముఖ దంత వైద్యుడు డాక్టర్ శ్రీదర్‌రెడ్డి, ఎస్టీయూ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎస్టీయూ నాయకులు బాలగంగిరెడ్డి, రవికుమార్, కెసురేష్‌బాబు, జయరామయ్య, జి.రామ్మోహన్, రమణారెడ్డి, వెంకటసుబ్బయ్య, పాల్గొన్నారు.

'వన్ నేషన్.. వన్ ఎలక్షన్ మోదీ కుట్ర'

కడప(కలెక్టరేట్), జనవరి 9: భారత దేశంలో మత విద్వేషాలను రెచ్చ గొట్టే విధంగా మోదీ ప్రభుత్వం వన్ నేషన్..వన్ ఎలక్షన్ ప్రక్రియకు పూనుకోవడం నియంతృత్వానికి నిదర్శనమని పీసీసీ రాష్ట్ర మైనార్టీ ఉపాధ్యక్షుడు మహమ్మద్ అలీఖాన్ విమర్శించారు. మంగళవారం కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో ఆయన మాజీ కార్పొరేటర్ రంతుల్లాఖాన్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు.

'కొళాయిలు తొలగించడం అన్యాయం'

కడప(కలెక్టరేట్), జనవరి 9: మాసాపేట, సున్నపురాళ్ల మిట్ట, కొత్త కొట్టాలో వీధి కుళాయిలను తొలగించడం అన్యాయమని కార్పొరేషన్ అధికారుల తీరుపై నగర కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు లావణ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం నగర సమస్యలు తెలుసుకొనేందుకు ఆమె 26వ డివిజన్ మాసాపేట పరిసర ప్రాంతాల్లో పృటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కమిషనరు వెంటనే చర్యలు తీసుకోకపోతే సీజనల్ వ్యాధుల బారిన పడే అవకాశాలున్నాయన్నారు.ఈ కార్యక్రమంలో నగర కాంగ్రెస్ మహిళా నాయకురాళ్లు లోకేశ్వరి, సులోచన, వెంకట సుబ్బమ్మ పాల్గొన్నారు.

ప్రకటన

నా క్లయింట్ అయిన శ్రీ చెప్పలి షేక్ సాజిద్ హుస్సేన్, తండ్రి వల్లి సాహెబ్, డోర్ నెం. 18/304-బి, సాతుచెంగన్నవీధి, కడపవారి సూచనల మేరకు ఇందుమూలముగా యావన్మందికి తెలియచేయడం ఏమనగా నా క్లయింట్ విక్రయ దస్తావేజు తేది : 12.12.2023, నెం. 9305/2023 ద్వారా క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని చెప్పలి షేక్ సాజిద్ హుస్సేన్‌గారి ద్వారా విక్రయించుకొనియున్నారు. సదరు ఆస్తికి సంబంధించిన లింకు డాక్యుమెంట్లు అయిన తేది : 24.06.1991, డాక్యుమెంటు నెం. 2454/1991 మరియు తేది : 25.05.1970, డాక్యుమెంట్ నెం. 1751/1970, వీటిని నా క్లయింట్ 23.12.2023వ తేదీన కడప ఐ.టి.ఐ. సర్కిల్ వద్ద జిరాక్స్ సెంటర్‌కు పోవుచుండగా సదరు డాక్యుమెంట్లు పోయినవి. ఈ విషయమై నా క్లయింట్ కడప తాలుకా సర్కిల్ ఇన్స్‌పెక్టరు వారికి ఒక కంప్లైంట్ ఇచ్చియున్నాడు. అయిననూ సదరు డాక్యుమెంట్లు దొరకలేదు. కావున సదరు డాక్యుమెంట్లు ఎవరికైనా దొరికిన యెడల నాకుగాని, నా యొక్క క్లయింటుకుగాని ఇవ్వవలసినదిగా కోరడమైనది. సదరు డాక్యుమెంట్ ఆస్తిని నా క్లయింట్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కడప వారి బ్రాంచి యందు తనఖా పెట్టి అప్పు తీసుకొనుచున్నాడు. ఎవరికైనా అభ్యంతరమైన యెడల నాకుగాని, సదరు బ్యాంకుకుగాని 7 రోజుల లోపల తెలియజేయవలెను మరియు సదరు ఆస్తి యందు ఎవరైనా ఎటువంటి లావాదేవీలు జరిపినా నా క్లయింట్ తీసుకొను సివిల్ మరియు క్రిమినల్ చర్యలకు బాధ్యులగుదురని తెలియజేయడమైనది.

యం. సాయి నిరంజన్‌బాబు బి.ఏ., బి.ఎల్., న్యాయవాది, కడప. సెల్ : 94403 53962

బాబుతోనే రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్తు : టీడీపీ




కడప: మాట్లాడుతున్న టీడీపీ కడప నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాధవీరెడ్డి_ బాబు ష్యూరిటీ కార్యక్రమంలో అమీర్‌బాబు, లక్ష్మీరెడ్డి

కడప (ఎర్రముక్కపల్లె), జనవరి 9 :టీడీపీ అధినేత చంద్రబాబునాయుడును సీఎంగా చేయడం వల్ల రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుదని టీడీపీ కడప నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆర్.మాధవీరెడ్డి, జనసేన జిల్లా కోఆర్డినేటరు సుంకర శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రంలో భాగంగా కడప నగరం 15వ డివిజన్ సరోజినీనగర్ మెయిన్ రోడ్డులో ఇంటింటికీ తిరిగి కరపత్రాలు అందించారు. అలాగే వైసీపీ అరాచక పాలనపై ప్రజలకు వివరించారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక చేపట్టబోయే అభివృద్ధి సంక్షేమ పథకాలకు సంబంధించి అవగాహన కల్పించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలన పెరుగుతోందన్నారు. ఈ పాలనకు అంతం చేయాల్సిన పరిస్థితి ఉందని స్పష్టం చేశారు. టీడీపీ నాయకులు నవనీశ్వర్‌రెడ్డి, ప్రసాద్, రెడ్డయ్య, రాయుడు, సురేష్, సుబ్బరాయుడు, సుబ్బారెడ్డితో పాటు జనసేన కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాల్లో వైసీపీ జెండాలు తొలగించండి

కడప (ఎడ్యుకేషన్), జనవరి 9 : కడప నగరంలోని ప్రభుత్వ స్థలాల్లో వైసీపీ జెండాలను తొలగిస్తామని టీడీపీ కడప నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆర్.మాధవీరెడ్డి డిమాండ్ చేశారు. లేదంటే టీడీపీ జెండాలను కూడా నగరంలోని అన్ని ప్రభుత్వ స్థలాల్లో ఎగరవేస్తామని హెచ్చరించారు. మంగళవారం 15వ డివిజన్ సరోజినీ నగర్‌లోబాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా పర్యటించారు. ఈ నేపథ్యంలో అక్కడున్న వైసీపీ జెండాలను చూసి ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలల్లో వైసీపీ జెండాలు తొలగించాలని పలుమార్లు కమిషనరుకు విన్నవించామని, అయితే ఎటువంటి పరిష్కార మార్గం కనబడలేదన్నారు. కమిషనర్ వైసీపీ నాయకులకు కొమ్ము కాయడం తగదన్నారు. వారంలో ఈ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం ఖాయం

టీడీపీ సీనియర్ నాయకులు అమీర్‌బాబు, లక్ష్మిరెడ్డి, మన్మోహన్‌రెడ్డి

టీడీపీ అధినేత చంద్రబాబు 2024 ఎన్నికల్లో సీఎం కావడం ఖాయమని టీడీపీ సీనియర్ నాయకులు అమీర్‌బాబు, లక్ష్మిరెడ్డి, మన్మోహన్‌రెడ్డిలు అన్నారు. మంగళవారం బాబుష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా బాలికల జూనియర్ కళాశాల ఎదుట ఉన్న దుకాణాలకు అలాగే ఆటోస్టాండ్లలో ఉన్న ఆటో డ్రైవర్లకు టీడీపీ కరపత్రాలను పంపిణీ చేస్తూ పథకాలను వివరించారు. అనంతరం వారు మాట్లాడుతూ సైకో పాలనలో అభివృద్ధి శూన్యమన్నారు . యువతకు ఉద్యోగావకాశాలు రావాలంటే చంద్రబాబు, లోకేశ్, పవన్‌కళ్యాణ్ సారధ్యంలో ప్రభుత్వం ఏర్పడాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలు ఎన్నికల కోసం ఎదురు చూస్తున్నారని రాబోవు ఎన్నికల్లో టీడీపీ విజయం తధ్యమని జోస్యం పలికారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి ఆమూరి బాలదాసు, నాయకులు కొండాసుబ్బయ్య, లింగాల శివశంకరరెడ్డి, జయారంరెడ్డి, కోవెలకుంట్లశ్రీనివఆసులు, పిచ్చయ్య, మేకల వెంకటేశ్‌యాదవ్, హరినాధరెడ్డి, చలపతిరావు, వీరభద్రయ్య, పల్లె సుధాకర్‌రెడ్డితో పాటు అధిక సంఖ్యలో టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.



చింతకొమ్మదిన్నె: తాడిగొట్లలో టీడీపీలో చేరిన వారితో పుత్తా

బాబుతోనే భరోసా: పుత్తా నరసింహారెడ్డి

సీకేదిన్నె, జనవరి 9: తెలుగుదేశం అధ్యక్షుడు చంద్రబాబునాయుడితోనే రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు భరోసా ఉంటుందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి పేర్కొన్నారు. చింతకొమ్మదిన్నె మండలం తాడిగొట్ల, రోడ్డు కృష్ణాపురంలో మంగళవారం 30 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. టీడీపీలోకి చేరినవారిలో ఎర్రగుంట్ల ఓబుళరెడ్డి ఆధ్వర్యంలో పి.నారాయణరెడ్డి, పుత్తా బాలకృష్ణారెడ్డి, ఎద్దుల కొండయ్యతో కలిసి 30 కుటుంబాలు టీడీపీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు టీవీ కృష్ణారెడ్డి, గంధం మోహన్‌బాబు, డాక్టర్ క్రిష్ణకిశోర్‌రెడ్డి, నారాయణ, కొండయ్య, ఆనంద్, జనసేన నాయకులు వేణు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీని గెలిపిస్తే ఇంటింటికీ సంక్షేమ పథకాలు

చెన్నూరు, జనవరి 9 : రాష్ట్రంలో టీడీపీని గెలిపిస్తే ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందుతాయని ఆ పార్టీ మండల కన్వీనరు కె.విజయభాస్కర్ రెడ్డి అన్నారు. మంగళవారం చెన్నూరు కొత్తరోడ్డు, శ్రీరామ్‌నగర్, లక్ష్మినగర్ తదితర ప్రాంతాల్లో టీడీపీ సీనియర్ నాయకులు, బలిజ సంఘం నేతలు జడ లక్ష్మినారాయణ, అతికారి విశ్వం ఆధ్వర్యంలో బాబుతోనే భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఇందిరెడ్డిశివారెడ్డి, ఐటీడీపీ ఎంకే కాంత్, మేడూరు రమణయ్య, నారాయణ, మజ్జారి చెన్నయ్య, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

తోపుడు బండ్ల వ్యాపారులకు షెల్టర్లు ఏర్పాటుచేస్తాం

మహిళల్లో ఆత్మగౌరవం పెంచేందుకే 'మహాశక్తి' : బీటెక్ రవి

పులివెందుల టౌన్, జనవరి 9: పట్టణంలో తోపుడు బండ్లపై విక్రయాలు చేసుకునే చిరు వ్యాపారులకు వాన, ఎండ, గాలికి ఇబ్బందులు లేకుండా టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే షెల్టర్లు ఏర్పాటుచేస్తామని నియోజకవర్గ ఇన్‌చార్జి బీటెక్ రవి అన్నారు. పులివెందులలో మంగళవారం బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం మెయిన్‌రోడ్డు, శ్రీరామహాల్‌రోడ్డు ప్రాంతాలలో నిర్వహించారు. కరపత్రాలు పంపిణీ చేసి టీడీపీ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా సార్వత్రిక ఎన్నికలు వస్తున్న తరుణంలో ఓట్ల కోసం మోడల్ టౌన్ పేరుతో ప్రణాళికలు లేకుండా పనులు చేస్తున్నారన్నారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఒక్క ఛాన్స్ అనిచెప్పి ప్రజాస్వామ్య వ్యతిరేక పాలనచేస్తున్నారన్నారు. చంద్రబాబు ప్రవేశపెట్టనున్న ఆరు పథకాలతో ప్రజల భవిష్యత్‌కు గ్యారెంటీని చేకూరుస్తుందన్నారు. ఆడవాళ్లు ఆత్మగౌరవం పెంచేందుకు టీడీపీ అమలు చేస్తున్న మహాశక్తి పథకం అని, ఆ పథకం గురించి ఆడవారికి వివరించారు. ప్రభుత్వం చేపట్టి నాలుగున్నర సం వత్సరాలు ఉండి మేము ఏదో అభివృద్ధి చేస్తున్నామని పదవి ముగిసే సమయంలో ఒక ప్రణాళిక లేకుండా రోడ్లు పగలగొట్టడం జరిగిందన్నారు. టీడీపీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. టీడీపీ నాయకులు జోగిరెడ్డి, వెంకటరామిరెడ్డి, శివమోహన్‌రెడ్డి, విశ్వనాథరెడ్డి, బాలమునిరెడ్డి, మధుసూధన్‌రెడ్డి, రాఘవరెడ్డి, సిద్దారెడ్డి, మైసూరారెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, మహబూబ్ బాష, ఖాసీంవల్లి పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న బీటెక్ రవి

హక్కుల సాధన కోసం సంఘటితం కావాలి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

కడప (మారుతీనగర్), జనవరి 9: హక్కుల సాధన కోసం జిల్లాలోని నాయీ బ్రాహ్మణులంతా సంఘటితం కావాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ నాయీ బ్రా హ్మణ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.కనకారావు, రాయచోటి మార్కెట్ యార్డ్ చైర్మన్ వండాడి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పత్తూరు గురుస్వామి ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కో ఆపరేటివ్ కాలనీలోని కమ్యూనిటీ హాలులో సమావేశం నిర్వహించి నూతన సంవత్సరం కేలండర్‌ను ఆవిష్కరించారు. ముఖ్య అతిథులుగా వారు హాజరై మాట్లాడారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బత్తల లింగమూర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్ గోవిందునాగరాజు, ప్రధాన కార్యదర్శి త్రివిక్రమ్‌యాదవ్, నాయకులు కళ్యాసుధాకర్, ఏపీ రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి సూరిబాబు, యలమంద, నాయీ బ్రాహ్మణ వాయిద్య కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు రంగయ్య పాల్గొన్నారు.

'ఎస్మాకు ఎదురొడ్డి పోరాడతాం'



మహవీర్ సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడిన అంగన్వాడీలు

కడప (నాగరాజుపేట), జనవరి 9 : ఎస్మాకు ఎదురొడ్డి పోరాడతాం అని అంగన్వాడీ కార్మికులు పేర్కొన్నారు. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలంటూ నగరంలోని కలెక్టరేట్ వద్ద గల మహావీర్ సర్కిల్ వద్ద అంగన్వాడీలు మంగళవారం మానవహారంగా ఏర్పడి నిరసనలు తెలిపారు. డిమాండ్లు నెరవేర్చేంత వరకు ఎస్మా చట్టానికి కానీ, అరెస్టులకు కానీ భయపడమని తేల్చి చెప్పారు. పిచ్చుకపై బ్రహ్మాస్త్రంలా మాపై ఎస్మాను ప్రయోగించడం సిగ్గుచేటన్నారు. గత 28 రోజుల నుంచి పలురకాలుగా సమ్మెలు చేస్తున్నా అంగన్వాడీలపై జగన్ ప్రభుత్వానికి కనికరం కూడా లేదన్నారు. ఎట్టి పరిస్థితుల్లో వెనుకడుగు వేసే పరిస్థితే లేదన్నారు. సీఐటీయూ కార్యదర్శి నాగసుబ్బారెడ్డి, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓబులేసు, అంగన్వాడీ జిల్లా కార్యదర్శి లక్ష్మిదేవిలు మరియు దీపా, పద్మావతి పాల్గొన్నారు.

'ఏపీ సర్కారు అప్రజాస్వామిక చర్యను తిప్పికొడదాం'

కడప (సెవెన్‌రోడ్స్), జనవరి 9 : ఏపీలో లక్షల మంది అంగన్వాడీలు, మున్సిపల్ వర్కర్లు, సర్వశిక్ష అభియాన్, ఆశా, మధ్యాహ్న భోజన కార్మికులు సమ్మె చేస్తున్నారు. రోజురోజుకూ సమ్మె ఉధృతం చేస్తుంటే జగన్ సర్కారు పరిష్కరించాల్సింది పోయి అత్యవసర సేవల చట్టం కిద సమ్మెను ఎస్మా పేరుతో అణగదొక్కాలని ప్రయత్నించడం ప్రభుత్వ నిరంశం కాదా అని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ఏఐటీయూసీ గౌరవాధ్యక్షుడు ఈశ్వరయ్య పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కడప కలెక్టరేట్ వద్ద అంగన్వాడీల రిలేదీక్షలు ప్రారంభించారు.

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు

వేంపల్లె, జనవరి 9: అంగన్వాడీ ఉద్యోగులు న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం సమ్మెను కొనసాగిస్తున్నారు. మంగళవారం రిలేనిరాహార దీక్షల్లో పాల్గొన్నారు. వేంపల్లె, వేముల, చక్రాయపేట మండలాలకు చెందిన అంగన్వాడీలు పాల్గొంటున్నారు. ప్రభుత్వం నుంచి ఎంత ఒత్తిడి వచ్చిన సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె ఆపేది లేదని అంగన్వాడీ ఉద్యోగులు స్పష్టం చేశారు.

పదవీ కాలం ముగిసిన సభ్యులకు సన్మానం

చక్రాయపేట, జనవరి 9: గండి క్షేత్రం పాలక మడలి సభ్యుల పదవీకాలం గడువు ముగిసిపోవడంతో మంగళవారం దేవస్థాన సహాయ కమిషనర్ ముకుందరెడ్డి చేతులమీదుగా ఘన సన్మానం నిర్వహించారు. గత రెండేళ్లగా ఆలయానికి వారు చేసిన సేవలు గుర్తుతెచ్చుకునేలా సభ్యులు వివరించారు.

'న్యాయమైన డిమాండ్ల సాధనకై పోరాడుదాం'

పులివెందుల రూరల్, జనవరి 9: అందరం కలిసి పోరాడితేనే న్యాయమైన డిమాండ్లు సాధించగలుగుతామని ఏఐటీయూసీ జిల్లా మధ్యాహ్న భోజన కార్మికుల గౌరవాధ్యక్షులు ఎస్.చాంద్‌బాష, అధ్యక్ష కార్యదర్శులు కామాక్షమ్మ, సులోచనమ్మ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్‌లో ఉన్న జీతాలు, మెస్ చార్జీలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఘనంగా రాహుకాల పూజలు



రాహుకాల దీపాలను వెలిగిస్తున్న భక్తులు (ప్రత్యేక అలంకరణలో విజయదుర్గాదేవి)

కడప (కల్చరల్), జనవరి 9: కడప నగరం బిల్టప్ సర్కిల్ సమీపంలోని విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం రాహుకాల పూజలు ఘనంగా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి పలువురు మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారి సన్నిధిలో నిమ్మకాయలతో కూడిన రాహుకాల దీపాలను వెలిగించి తమ భక్తిని చాటుకున్నారు.

వికాస్ హైస్కూలులో ఘనంగా ముందస్తు సంక్రాంతి వేడుకలు



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న వికాస్ హరిక్రిష్ణ

కడప (ఎర్రముక్కపల్లె), జనవరి 9 : కడప నగరం అక్కాయపల్లె వికాస్ ఇంగ్లీషు మీడియం స్కూలులో మంగళవారం ముందస్తు సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. భోగిమంటలు వేశారు. చిన్నారులకు భోగి పండ్లతో ఉపాధ్యాయులు ఆశీర్వదించారు. విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. 9వతరగతి నివేదిత మొదటి బహుమతి, స్వాతి ద్వితీయ బహుమతి, సాయిలిఖిత తృతీయ బహుమతి సొంతం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ వికాస్ హరిక్రిష్ణ, ప్రధానోపాధ్యాయులు హమీద్, ప్రిన్సిపాల్ ఫాతిమా, ఏఓ స్వర్ణలత విద్యార్థులకు బహుమతులు అందించారు. అనంతరం హరిక్రిష్ణ మాట్లాడుతూ తెలుగువారు జరుపుకునే అతి పెద్దపండుగ సంక్రాంతి అని, ఈ పండుగను రైతుల పండుగ అని కూడా అంటారన్నారు. ఈ సం క్రాంతి మూడురోజుల పాటు ఆనందంగా చేసుకుంటారన్నారు. మొదటిరోజు భోగి, రెండోరో జు సంక్రాంతి, మూడోరోజు కనుమ కొన్ని ప్రాంతాల్లో నాలుగవ రోజు ముక్కనుమగా జరుపుకునే అవకాశం ఉందన్నారు. ఈ మూడు రోజుల్లో మొదటిరోజు భోగిమంటలతో, రెండోరోజు పొంగలి పిండివంటలతో పితృదేవతల పూజలతో, మూడోరోజు గోపూజలతో మాంసం ప్రియులకు మాంసాహారం ఉంటుందన్నారు.

మానవ అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలి

● సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫక్రుద్దీన్

కడప రూరల్, జనవరి 9 : మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం, మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమశాఖ, పోలీస్ అధికారులు మానవ అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేశాలా తగు చర్యలను చేపట్టాలని సీనియర్ సివిల్ జడ్జి, డీఎల్ఎస్ఏ సెక్రటరీ ఎస్.బాబా ఫక్రుద్దీన్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కోర్టు ఆవరణంలోని న్యాయసేవా సదన్‌లో ఏపీ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ, హైకోర్టు ఆదేశాల మేరకు స్టేట్ ప్లాన్ ఆఫ్ యాక్షన్ అండ్ క్యాలండర్ ఆఫ్ యాక్టివిటీస్‌లో భాగంగా తప్పిపోయి, గుర్తించబడని పిల్లల కేసులను సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా అత్యంత హేయమైన చర్య అన్నారు. ఇందుకు బాధ్యులైన వారిపై చట్టపరంగా కఠినమైన శిక్షలకు బాధ్యులు కావాల్సి ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలో మానవ అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేశాలా మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం, మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ, పోలీస్ అధికారులు తగు చర్యలను చేపట్టాలన్నారు. వివిధ పోలీస్‌స్టేషన్లలో పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను పరిశీలించి తగు సూచనలు చేశారు. తప్పిపోయిన పిల్లలను గుర్తించి వారిని తిరిగి కుటుంబంతో కలపాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ అధికారులు పాల్గొన్నారు.

ఎమర్జెన్సీని తలపిస్తున్న జగన్‌రెడ్డిపాలన: డీవైఎఫ్ఐ

కడప (నాగరాజుపేట), జనవరి 9:జగన్‌రెడ్డి పాలన ఎమర్జెన్సీని తలపిస్తోందని డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి డీఎం ఓబులేసు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం సాయంత్రం పోలీసులు తనకు ముందస్తు నోటీసులు ఇచ్చారన్నారు. మంగళవారం ఉదయం 7గంటలకే ఇంటి వద్ద డీవైఎఫ్ఐ నగర కార్యదర్శిని పోలీసులు అరెస్టు చేసి తాలుకా స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఓబులేసు మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా అదిగో డీఎస్సీ ఇదిగో డీఎస్సీ అని నిరుద్యోగులను నయవంచన చేస్తోందన్నారు. తక్షణమే మెగా డీఎస్సీపై ప్రకటన చేయాలని, లేకుంటే చలో సీఎం క్యాంపు కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. ఇలా అక్రమ అరెస్టు చేయడం సిగ్గుచేటన్నారు. ఉద్యమాలపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపితే శంకరగిరి మాన్యాలు తప్పవని హెచ్చరించారు.

ముందస్తు నోటీసులు ఇస్తున్న పోలీసులు

నాలుగో రోజు కొనసాగిన విద్యుత్ ఉద్యోగుల నిరసన

కడప (చిన్నచౌకు), జనవరి 9 : కడప విద్యుత్ విద్యుత్ భవన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులు నాలుగవ రోజు తమ నిరసన కొనసాగించారు. 9వ రోజులు గడిచినప్పటికీ రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ ఉద్యోగులకు జీతాలు చెల్లించకపోవడం దయనీయమని వారు పేర్కొన్నారు. గతంలో ఇటువంటి పరిస్థితి ఎప్పుడూ చూడలేదని ప్రశ్నించారు. ఇదే పరిస్థితి కొన సాగితే విద్యుత్ ఉద్యోగులు సమ్మెకు సిద్ధం కావాల్సి ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ యూనియన్ నాయకులు శివ భాస్కర్, నాగేశ్వరరెడ్డి, శివశంకర్, ఎంవీ చలపతి, పీసీ క్రిష్ణయ్య, సుబ్రమణ్యం, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నిరాశ్రయుల వసతిగృహంలో అన్నదానం



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న కుటుంబ సభ్యులు

కడప (ఎడ్యుకేషన్), జనవరి 9 : కడపనగరం మద్రాసు రోడ్డు అమ్మఒడి నిరాశ్రయుల వసతిగృహంలో లేవాకు నారపురెడ్డి 12వ వర్ధంతిని పురస్కరించుకుని అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు భోజనం, పండ్లు, స్వీట్లు పంచిపెట్టారు. కుటుంబ సభ్యులు లేవాకు రఘునాథరెడ్డి, లక్ష్మిరెడ్డి, నితీష్‌కుమార్‌రెడ్డి, బంధుమిత్రులు పాల్గొన్నారు.

దేశాయ్ రామలింగారెడ్డిని పరామర్శించిన తులసిరెడ్డి

చక్రాయపేట, జనవరి 9: చిలేకాంపల్లె దేశాయ్ రామలింగారెడ్డి అనారోగ్యంతో బాధపడుతుండడంతో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ తులసిరెడ్డి మంగళవారం పరామర్శించారు. దేశాయ్ రామలింగారెడ్డి టీడీపీలో చురుగ్గా పాల్గొని మంచి పేరు తెచ్చుకోవడంతో పార్టీలకతీతంగా పరామర్శిస్తున్నారు. ఆయన ఆరోగ్యం కుదుటపడాలని కోరారు. ఆయన యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుబ్బారెడ్డి, నరసింహారెడ్డి, ఉత్తన్న, అమర్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమం

కడప (ఎర్రముక్కపల్లె), జనవరి 9 :మున్సిపల్ కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించేంత వరకు తమ పోరాటం ఆగదని మున్సిపల్ కార్మికుల సంఘం ప్రతినిధులు హెచ్చరించారు. మంగళవారం మున్సిపల్ కార్మికుల సమ్మెలో భాగంగా కార్పొరేషన్ ఎదుట అర్ధనగ్న ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మున్సిపల్ వర్కర్స్ అధ్యక్షుడు శ్రీరామ్ మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని లేదంటే కార్మికులకు ఉద్యోగభద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మిక నాయకులు తిరుపాల్, సుంకర రవి, కిరణ్, శ్రీధర్‌బాబు, శ్రీరాం, శివ పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ శవయాత్ర



శవయాత్ర నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులు

కడప (సెవెన్‌రోడ్స్), జనవరి 9 : మున్సిపల్ కార్మికులు రాష్ట్ర వ్యాప్తంగా చేస్తున్న సమ్మె జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ నిర్లక్ష్య మూలంగానే కొనసాగుతుందని నిరసిస్తూ మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ శవయాత్రను కార్మికులు నిర్వహించారు. పటాకులు కాల్చుతూ, పలకలతో ఊరేగింపు కడప నగర పాలక సంస్థ కార్యాలయం నుండి కోటిరెడ్డిసర్కిల్ వరకు నిర్వహించి కోటిరెడ్డిసర్కిల్ వరకు నిర్వహించి కోటిరెడ్డిసర్కిల్‌లో దహన కార్యక్రమం ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయుసి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు కేసీ బాదుల్లా, నగర అధ్యక్ష కార్యదర్శులు నరసింహులు, తారక రామారావులు మాట్లాడారు.

చంద్రబాబును కలిసిన వరద



ప్రొద్దుటూరు జనవరి 9 : నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో జరిగిన రా కదలి రా టీడీపీ కార్యక్రమానికి ప్రొద్దుటూరు నుంచి టీడీపీ సీనియర్ నాయకుడు మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి తన అనుచరగణంతో కలిసి వాహనాల్లో వెళ్లారు. చంద్రబాబును కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. నియోజకవర్గంలో జరుగుతున్న టీడీపీ కార్యకలాపాలపై చర్చించారు. మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, మాజీ మున్సిపల్ చైర్మెన్ ఆసం రాఘురామిరెడ్డి కూడా చంద్రబాబును కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు.

చంద్రబాబును కలిసిన ప్రవీణ్‌రెడ్డి



ప్రొద్దుటూరు,జనవరి 9 : ఆళ్లగడ్డ టీడీపీ కార్యక్రమానికి వచ్చిన చంద్రబాబును ప్రొద్దుటూరు టీడీపీ ఇన్‌చార్జ్ ప్రవీణ్‌రెడ్డి కలిశారు. మంగళవారం ఆయన ప్రొద్దుటూరు నుంచి కార్యకర్తలతో ఆళ్లగడ్డ మీటింగ్‌కు బయలు దేరివెళ్లారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌రెడ్డితో చంద్రబాబు నియోజకవర్గంలో జరుగుతున్న పార్టీ కార్యకలాపాలపై ఆరా తీశారు.

ఉప్పలూరులో టీడీపీలో చేరిన 50 కుటుంబాలు



టీడీపీలో చేరిన వారితో భూపేశ్‌రెడ్డి

ముద్దనూరు జనవరి9: మండల పరిధి ఉప్పలూరు గ్రామంలో మంగళవారం 50కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి.వారికి జమ్మలమడుగు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి,మాజీ ఎమ్మెల్సీ శివనాథరెడ్డి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో లింగందిన్నె నాగిరెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, గంగిరెడ్డి, పోలిరెడ్డి, వెంకటరామిరెడ్డి, శివామిరెడ్డి,స్థానం కొండారెడ్డి, భగవాన్‌రెడ్డి, గంగిరెడ్డి రామిరెడ్డి, షరీఫ్, షబ్బీర్, బాషా, శేఖర్‌రెడ్డి, సుమంత్, చిన్నరెడ్డి, అనీఫ్, ప్రసాద్ రెడ్డి, షేక్షావలి, రాజేష్‌రెడ్డి, మల్లారెడ్డి, శేఖర్, నందురెడ్డి, రామకృష్ణ, శంకర్‌రెడ్డి, ప్రతాప రెడ్డి, లక్ష్మీనారాయణ, గుర్రప్ప, నాగేష్‌రెడ్డి ఉన్నారు. ఈ కార్యక్రమంలో జంబాపురం రమణారెడ్డి, వేల్పుచర్లరామాంజనేయరెడ్డి, పెద్దబాబు, నాగేంద్ర, ఓబుల్‌రెడ్డి, రాజా, ఆంజనేయులు,ఓబులేసు టీడీపీ నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

చంద్రబాబు పథకాలను ఆదరించండి



పథకాలపై ప్రచారం చేస్తున్న టీడీపీ నియోజకవర్గఇన్‌ఛార్జ్ బొజ్జ రోశన్న

పోరుమామిళ్ల, జనవరి 9 :చంద్రబాబు పథకాలను ఆదరించాలని టీడీపీ బద్వేలు ఇన్‌ఛార్జ్ బొజ్జ రోశన్న అన్నారు. మంగళవారం పోరుమామిళ్లలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీలో భాగంగా ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ యనమల సుధాకర్, టీడీపీ మం డల పార్టీ అధ్యక్షుడు నగరి భైరవ ప్రసాద్, సీతా వెంకటసుబ్బయ్య, సీతాబాలాజీ, ఇమాంహుసేన్, శెట్టెం ప్రతాప్, షరీఫ్, అతికారి రాజా, కరీముల్లా, గిరిరాముడు, జిలానీ పాల్గొన్నారు.

నవ్యాంధ్ర నిర్మాత చంద్రబాబు



ప్రచారంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు, జనవరి 9 : నవ్యాంధ్ర నిర్మాత చంద్రబాబేనని మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వివేకానంద క్లాత్ మార్కెట్‌లో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ ముందస్తు మేనిఫెస్టోలో పేర్కొన్న ఆరు గ్యారెంటీల కరపత్రాలను వ్యాపారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వివేకానంద క్లాత్ మార్కెట్ అసోసియేషన్ వంకదార వీరభద్రయ్య, జానపాటి రామక్రిష్ణ, ఉండేల శంకర్‌రెడ్డి, రామచంద్రయాదవ్, అమూల్య క్రిష్ణ, రామక్రిష్ణయ్య, జానకిరామ్, ఊట్ల గోపాల్, మార్తల భాస్కర్‌రెడ్డి, పోలంకి సురేష్, వద్ది బాలుడు,టప్పాబాషా, సోమా బాలయ్య, ఎర్రన్న, తలారి పుల్లయ్య, ధనిరెడ్డి రామచంద్ర రెడ్డి క్రిష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బెదిరింపులు మాని హామీలు నెరవేర్చండి

● మోకాళ్లపై నిల్చొని,చేతికి బేడీలు వేసుకొని అంగన్వాడీల నిరసన ● 29వ రోజుకు చేరిన సమ్మె

జమ్మలమడుగు, జనవరి 9: జగన్‌మోహన్‌రెడ్డి బెదిరింపులు మాని హామీ మేరకు తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు ప్రభుత్వాన్ని విమర్శించారు. మంగళవారం జమ్మలమడుగులో ఐసీడీఎస్ కార్యాలయం ఎదురుగా అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు మోకాళ్లపై నిల్చొని అంగన్వాడీలు నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు, ఏఐటీయూసీ నాయకుడు ఓబులేసు, అంగన్వాడీ అసోసియేషన్ నాయకుడు నరసమ్మ, లక్ష్మీదేవి, భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

మైదుకూరు..: తమపై ఎస్మా పెట్టిన జగన్ ఆయన ఇచ్చిన మాట ప్రకారమే జీతాలు పెంచుతా అని మళ్లీ మాట ఇస్తే ఇప్పుడే సమ్మె విరమిస్తామంటూ అంగన్వాడీ కార్యకర్తలు పేర్కొన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలంటూ అంగన్వాడీ కార్యకర్తలు చేపట్టిన ఆందోళనలు మంగళవారం నాటికి 29వ రోజుకు చేరుకున్నాయి. స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద చేపట్టిన సమ్మె వివిధ నిరసన కార్యక్రమాలతో కొనసాగుతున్నాయి. ఈ కార్యక్రమంలో నాయకులు శివకుమార్, శ్రీరాములు, ఏవీ శివరాం, షావలి, షరీఫ్, జహంగీర్ , అంగన్వాడీ కార్యకర్తలు గంగావతి, ధనలక్ష్మి పాల్గొన్నారు.

కొండాపురం..: చేతికి బేడిలు వేసుకొని మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలు,ఆయాలు 29వ రోజు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. న్యాయమైన తమ డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరారు.సీఐటీయూ, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బద్వేలు రూరల్..: తమ న్యాయమైన సమస్యలుపరిష్కరించాలని కోరుతూ చేపట్టిన సమ్మెలో భాగంగా మంగళవారం నాలుగురోడ్ల కూడలిలో మానవహారం చేపట్టి అంగన్వాడీలు రాస్తారోకో నిర్వహించారు.కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు , డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చిన్ని, అంగన్వాడీ నాయకురాళ్లు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల..: అంగన్వాడీలను జైల్లో అయినా పెట్టండి లేదా జీతాలు పెంచండి అని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు భైరవ ప్రసాద్ అన్నారు. పోరుమామిళ్ల తహసీల్దారు కార్యాలయం ఎదుట 29 రోజులుగా సమ్మె నిర్వహిస్తున్నారు. మంగళవారం అంబేడ్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా పోలీసులు స్టేషన్ తరలించడం జరిగింది. కాగా పోరుమామిళ్ల, కలసపాడు. కాశినాయన మండలాల్లో ధర్నా చేస్తున్న అంగన్వాడీల పేర్లనుపోలీసులు నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల నాయకులు బొజ్జ చిన్నయ్య, జిల్లా కమిటీ సభ్యురాలు ఓబులాపురం విజయమ్మ, కేవీపీఎస్ మండల నాయకుడు రత్నం, ప్రాజెక్టు అధ్యక్ష కార్యదర్శులు బసిరెడ్డి, వినోదాదేవి, బషీరమ్మ, జ్యోతమ్మ, ఫాతిమా, శ్రీదేవి, రమాదేవి పాల్గొన్నారు.

చాపాడు..: తహసీల్దారు కార్యాలయం ఎదురుగా అంగన్వాడీ కార్యకర్తలు మంగళవారం 29వ రోజు నిరసన వ్యక్తం చేశారు. 29 అనే సంఖ్య కనిపించే విధంగా వారు వరుసల్లో కూర్చొని నిరసన చేశారు. జీవో నెంబరు 2ను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు.



కొండాపురంలో చేతికి బేడీలు వేసుకుని నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు



మైదుకూరులో...





బద్వేలు, పోరుమామిళ్లలో మానవహారంగా ఏర్పడి నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు



జమ్మలమడుగులో...

బ్రాహ్మణపల్లెలో జగనన్న ఆరోగ్యసురక్ష

గోపవరం, జనవరి 9 : మండల పరిధిలోని బ్రాహ్మణపల్లెలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి మహేశ్వర్‌రెడ్డి, ఎంపీడీవో సాయినాయక్‌ల ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమంలో కార్యదర్శి మోష్, వైద్యాధికారి మురళిక్రిష్ణ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

30 మంది బైండోవర్

ఖాజీపేట, జనవరి 9: మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన 30 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసి తహసీల్దారు వద్ద హాజరుపరిచినట్లు ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ముందుజాగ్రత్తగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు ప్రతి గ్రామంలో కొందరిపై బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నామన్నారు. ఎవరైనా ఎన్నికలలో ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని వారు అన్నారు.

బకాయిలు అడిగితే నిర్బంధించడం తగదు

బద్వేలు, జనవరి 9: ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన బకాయిలు చెల్లించాలని ప్రజాస్వామిక పద్ధతిలో పోరాటం చేస్తున్న యూటీఎఫ్ ఉపాధ్యాయులపై పోలీసుల చేత నిర్బంధం ప్రయోగించి అరెస్టుచేయడం తగదని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మాదన విజయ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జనవరి 9,10 తేదీలలో 36 గంటల దీక్ష చేస్తున్నామని 15 రోజుల క్రితమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మంత్రులకు నోటీసులు ఇచ్చినా, చర్చలకు పిలిచి పరిష్కరించకుండా ధర్నాకు అనుమతి ఇవ్వకుండా ఉద్యోగ, ఉపాధ్యాయులను నిర్బంధించడం దుర్మార్గమన్నారు. విజయవాడలో విజయ్‌కుమార్‌తో పాటు అరెస్టు అయిన వారిలో బద్వేలు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దేవానందం, సుధాకర్, జిల్లా కౌన్సిల్ సభ్యులు చెన్నయ్య, మస్తాన్‌వల్లి ఉన్నారు.

సమస్యలు త్వరితగతిన పూర్తి చేయాలి

జమ్మలమడుగు, జనవరి 9: జమ్మలమడుగు నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో అధికారులు తనిఖీలు చేసి సమస్యలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్డీవో శ్రీనివాసులు సూచించారు. మంగళవారం జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయ సభాభవనంలో పొలిటికల్ పార్టీ ప్రతినిధులతో సమావేశం అయ్యారు. అనంతరం నియోజకవర్గంలోని తహసీల్దార్లు, ఇతర బూత్ లెవెల్ అధికారులతో సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో నియోజకవర్గంలోని కొండాపురం, ముద్దనూరు, మైలవరం, పెద్దముడియం, ఎర్రగుంట్ల, జమ్మలమడుగు మండలాల్లోని పోలింగ్ బూత్‌లలో సమస్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని పోలింగ్ అధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

జమ్మలమడుగు, జనవరి 9: జమ్మలమడుగులో ధోనీ లెవెన్ ఆధ్వర్యంలో స్థానిక పీఆర్ హైస్కూలు మైదానంలో రాయలసీమ స్థాయిలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. గతనెల 22వ తేదీ నుంచి ఈ పోటీలు జరిగాయి. అందులో 36 జట్లు పాల్గొన్నాయి. ప్రొద్దుటూరుకు చెందిన సుషాంత్‌లెవెన్ జట్టు విన్నర్‌గా, రన్నర్‌గా జమ్మలమడుగు బసిరెడ్డి జట్టు విజేతలుగా నిలిచాయి. ముఖ్య అతిథులు వంగల నాగేంద్రయాదవ్, ఎన్ఆర్ కళాశాల అధ్యాపకుడు రాజు మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసంతోపాటు ఆరోగ్యమన్నారు. మొదటి బహుమతి రూ.30 వేలు, రెండో బహుమతి రూ.15 వేలు అందజేశారు.

ఎమ్మెల్యే ఫోన్ హ్యాక్ చేసిన వారిని శిక్షించాలి

జీవీ ప్రవీణ్ కుమార్‌రెడ్డి

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 9 :ఎమ్మెల్యే రాచమల్లు సెల్ ఫోన్ హ్యాక్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని, దీనిపై ఎస్పీ విచారణ చేసి దోషులను శిక్షించాలని ప్రొద్దుటూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆస్ట్రేలియాలో ఫోన్ హ్యాక్ చేశారని, తనను అంతం చేయడానికి 25 శాతం పేమెంట్ చెల్లించారంటున్న ఎమ్మెల్యే ఆ వ్యక్తిపేరును బయట పెట్టాలని పేర్కొన్నారు. బుకీలతో ఎమ్మెల్యేకు ఉన్న ఆర్థిక లావాదేవీలతోనే ఫోన్ హ్యాక్ చేసి ఉండవచ్చునని అనుమానం వ్యక్తం చేశారు. తన ఫోన్ హ్యాక్ చేసిన విషయంపై ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యే నందం సుబ్బయ్య హంతకులను శిక్షించాలని, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌ను బెదిరించిన వారిని, మహిళా ఎస్ఐపై రాళ్ల దాడి చేసిన వారిని శిక్షించాలని కోరితే బాగుండేదన్నారు.

రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు గ్యారెంటీ టీడీపీ



ప్రచారం చేస్తున్న ప్రవీణ్‌రెడ్డి

ప్రొద్దుటూరు , జనవరి 9 : రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు గ్యారెంటీ టీడీపీనేనని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ ప్రవీణ్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పాత బస్టాండ్ ఏరియా రాజీవ్ సర్కిల్ ప్రాంతాల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ చేపట్టారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు విశ్వనాథరెడ్డి, వెలవలి పద్మనాభరెడ్డి, బీసీ సెల్ కార్యదర్శితాటి శ్రీనివాసులయాదవ్, తమ్మిశెట్టి శ్రీను, పొట్టిపాటి గంగాధర్,కేవీ క్రిష్ణారెడ్డి ,కరీముల్లా, మధు, సురుసుర శ్రీను పుల్లయ్య, మేరువ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీని ఆదరించండి : పుట్టా



నరసన్నపల్లె గ్రామంలో ప్రచారం చేస్తున్న పుట్టా సుధాకర్‌యాదవ్

బ్రహ్మంగారిమఠం, జనవరి 9: వచ్చే ఎన్నికల్లో టీడీపీని ఆదరించాలని మైదుకూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జ్ పుట్టా సుధాకర్‌యాదవ్ అన్నారు. మంగళవారం బ్రహ్మంగారిమఠం మండలంలోని నరసన్నపల్లె బీసీ కాలనీ, ఆశ్రమం గ్రామాల్లో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి టీడీపీ అమలు చేయబోయే మినీ మేనిఫెస్టోను ప్రజలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, మాజీ నీటి సంఘం అధ్యక్షుడు పెసల ఈశ్వర్ రెడ్డి, బీమానాయుడు, మిల్లు శ్రీను, వెంకటేశ్వర్‌నాయుడు, వెంకటేశ్వర్లు, జయరాంనాయుడు,పట్టాభిరాం,శ్రీను,గంగయ్య, రామయ్య, నాగరాజు, చెవులవెంకటేశ్వర్లు, నాగయ్య, పల్లె గంగాధర్, వినోద్, సురేంద్ర, టీఎన్ఎస్ఎఫ్ నేత వెంగల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా ఎస్టీయూ వజ్రోత్సవ వేడుకలు



వజ్రోత్సవ వేడుకలు నిర్వహిస్తున్న ఎస్టీయూ నేతలు

జమ్మలమడుగు, జనవరి 9: జమ్మలమడుగులో గాంధీ విగ్రహం వద్ద మంగళవారం ఎస్టీయూ వజ్రోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్టీయూ ఉపాధ్యాయులు ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. అనంతరం ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గురుకుమార్ మాట్లాడుతూ వజ్రోత్సవ వేడుకలు ఈనెల 12వ తేదీ కర్నూలులో అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ చంద్రకళ, సూర్యనారాయణరెడ్డి, ఉపాధ్యాయులు ప్రతాప్‌రెడ్డి, కుండా భాస్కర్, రంగేశ్వరరెడ్డి, ప్రసాద్‌బాబు, శివరామిరెడ్డి, మల్లికార్జున, భార్గవ, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సమతా సంకల్పమే ప్రభుత్వ ధ్యేయం



నివాళి అర్పిస్తున్న వెంకటరమణయ్య

ప్రొద్దుటూరు ,జనవరి 9 : సామాజిక సమతా సంకల్పమే ప్రభుత్వ ధ్యేయమని మున్సిపల్ కమిషనర్ పత్తిపాటి వెంకటరమణయ్య పేర్కొన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో అంబేడ్కర్ సామాజిక న్యాయ శిల్పంపై సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కమిషనర్‌మాట్లాడుతూ ఏపీలో అత్యంత ఎత్తైన అంబేడ్కర్ మహా శిల్పం ఏర్పాటు జరుగుతుందన్నారు. సామాజిక న్యాయానికి ప్రతిబింబమైన అంబేడ్కర్ ఈ దేశ చరిత్ర వున్నంతవరకు ఆయన గుర్తుంటాడన్నారు. కార్యక్రమంలో టౌన్‌ప్లానింగ్ ఏసీపీ మునిరత్నం,మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పండుగపూట కూడా పస్తులేనా..?

పోరుమామిళ్ల, జనవరి 9 : మేజరు పంచాయతీలో పని చేస్తున్న కార్మికులకు 20 నెలలుగా వేతనాలు ఇవ్వడంలో అధికారులు విఫలమయ్యారని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పిడుగు మస్తాన్ అన్నారు. మంగళవారం పోరుమామిళ్ల ఈవోఆర్‌డి యాస్మిన్‌కు, ఈవో వెంకటసుబ్బయ్యకు వినతిపత్రం ఇచ్చారు. చిన్నరామయ్య, యాకోబ్, కార్మికులు పాల్గొన్నారు.

బెదిరింపులతో సమ్మెను అడ్డుకోలేరు

జమ్మలమడుగు, జనవరి 9: జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలో పాత బస్టాండు మస్టర్‌పాయింట్ వద్ద మంగళవారం సమ్మెలో భాగంగా 15వ రోజు వర్కర్లు చేతికి సంకెళ్లు వేసుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి మున్సిపల్ వర్కర్లకు ఇచ్చిన హామీ మాట తప్పారన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు యేసుదాసు, దాసరి విజయ్, శేఖర్, నాగన్న, వినయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

బద్వేలు..: అరెస్టులు, బెదిరింపులతో సమ్మెను అడ్డుకోలేరని బద్వేలు మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట సంకెళ్లతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ పట్టణ ప్రధాన కార్యదర్శి నాగేంద్రబాబు మాట్లాడారు. ఈకార్యక్రమంలో డీవైఎఫ్ఐ పట్టణ ఉపాధ్యక్షుడు శ్యాం ప్రవీణ్, కార్యనిర్వాహక అధ్యక్షుడు హరి, ఉపాధ్యక్షులు దేవమ్మ, శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి నాగేంద్రబాబు, కోశాధికారి శివకుమార్, కార్యదర్శులు సత్యరాజు, పాల య్య, కిరణ్, పెంచలవరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో..: ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంలో నిర్లక్ష్య ధోరణి వస్తున్న ఈ ప్రభుత్వానికి పతనం తప్పదని ఏఐటీయూసీ పట్టణ ప్రధాన కార్యదర్శి నాగేష్ పేర్కొన్నారు. కార్మికుల విషయంలో ప్రభుత్వం చేస్తున్న కాలయాపనను నిరసిస్తూ మంగళవారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ కార్యదర్శి వెంకటసుబ్బయ్య, మునిసిపల్ యూనియన్ సీనియర్ నాయకులు రమణారావు, దేవ సహాయం, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

మైదుకూరు..: సమస్యలు పరిష్కరించాలంటూ మున్సిపల్ కార్మికులు మంగళవారం ఒంటికాలిపై నిలబడి అర్ధ నగ్న ప్రదర్శన చేపట్టిన నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకట సుబ్బయ్య, కళ్యాణ్, చిన్న పాల్గొన్నారు. ఆందోళన ఉధృతంలో భాగంగా అర్ధ నగ్న ప్రదర్శన చేపట్టినట్లు వారు తెలిపారు.

ప్రొద్దుటూరు..: విధుల్లోకి వెళ్లాలని మున్సిపల్ కార్మికులు అధికారులను బెదిరించటం తగదని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు చంటి కార్యదర్శి సాల్మన్‌లు విజ్ఞప్తి చేశారు.మంగ్లవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె 16 వ రోజు కు చేరుకుంది. ఈ సందర్భంగా కార్మికులు తమ హక్కులకు ప్రభుత్వాలు సంకెళ్ళుకేస్తున్నాయని చేతులను తాళ్లతో బంధించుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారులు కొందరు కార్మికులను ప్రలోభపెట్టడం బెదిరించటం చేస్తువారిని పనిలోకి తీసుకెళుతన్నారన్నారు. ప్రభుత్వం కార్మికుల డిమాండ్లపై స్పష్టమైన జీవో విడుదల కాకుండా సమ్మె విరమించేదిలేదన్నారు. కార్యక్రమంలో సిఐటియూ జిల్లాకార్యదర్శి సత్యనారాయణ, పట్టణ కార్యదర్శి విజయ్‌కుమార్,మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నేతలు పాల్గొన్నారు.







బద్వేలు, ప్రొద్దుటూరులో చేతులకు సంకెళ్లతో నిరసన తెలుపుతున్న కార్మికులు మైదుకూరులో ఒంటికాలిపై అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న మున్సిపల్ కార్మికులు